11th Year Anniversary

ప్రకటన కర్తలకు, పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి 11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 9 సంచిక : 41 పేజీలు :12 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | శనివారం 18 అక్టోబర్ 2025 | వెల : 5/-రూ ॥

VOLUME :9 ISSUE : 41 PAGES :12 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | SAT 18 OCTOBER 2025 | PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## తిరుపతి కలెక్టరేట్‌ను బాంబులతో పేల్చేస్తాం'

- తిరుపతి కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు ఈ-మెయిల్
- తమిళనాడు నుంచి వచ్చినట్టు గుర్తించిన సైబర్ క్రైమ్ పోలీసులు
- భారీగా మోహరించిన బాంబ్, డాగ్ స్క్వాడ్స్ బలగాలు
- గంటల తరబడి తనిఖీలు.. ఏమీ లభించలేదని వెల్లడి
- గత 15 రోజులుగా వరుసగా వస్తున్న బెదిరింపులు

**పెన్ పవర్ డెస్క్:**తిరుపతి కలెక్టరేట్ కు మరోసారి బాంబు బెదిరింపు వచ్చింది. కలెక్టర్ కార్యాలయాన్ని బాంబులతో పేల్చేస్తామంటూ ఓ ఆగంతుకుడి నుంచి వచ్చిన బెదిరింపు ఈ-మెయిల్ శుక్రవారం తీవ్ర కలకలం సృష్టించింది. ఈ సమాచారం అందుకున్న వెంటనే భద్రతా బలగాలు అప్రమత్తమై కలెక్టరేట్ ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని ముమ్మరంగా తనిఖీలు చేపట్టాయి.

**తమిళనాడు నుంచి బెదిరింపు**

గురువారం రాత్రి 10 గంటల సమయంలో కలెక్టరేట్ అధికారిక మెయిల్‌కు ఈ బెదిరింపు సందేశం వచ్చింది. "కలెక్టరేట్‌ను బాంబులతో పూర్తిగా పేల్చేస్తాము.

వివరాలు 2లో..

## ఈ పథకంలో ప్రజలందరూ
# భాగస్వాములు కావాలి

- 'పి-4 జీరో పావర్టీ'లో పౌరులంతా భాగస్వాములు కావాలని సీఎం పిలుపు
- అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా 'ఎక్స్'లో పోస్ట్
- పేదరికం లేని రాష్ట్రమే స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యమన్న చంద్రబాబు
- 16 నెలల్లో లక్ష కోట్ల రూపాయలకు పైగా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని వెల్లడి
- పేదల ఆత్మగౌరవాన్ని కాపాడటమే నిజమైన నిర్మూలన అని స్పష్టం
- ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, స్త్రీ శక్తి వంటి పథకాల గురించి ప్రస్తావన




**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పి-4 జీరో పావర్టీ' (పేదరిక నిర్మూలన) కార్యక్రమంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం 'అంత ర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం' సందర్భంగా, పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. పేదరిక నిర్మూలన అంటే కేవలం పేదలకు ఆర్థిక సాయం అందించడం మాత్రమే కాదని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. వారి ఆత్మగౌరవాన్ని కాపాడటంతో పాటు, ఎదుగుదలకు సమాన అవకాశాలు కల్పించి, అందరితో సమానంగా ముందుకు సాగేలా చేయడమే అసలైన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047' ప్రధాన ధ్యేయం కూడా పేదరిక నిర్మూలనేనని, ఆ లక్ష్యాన్ని సాధించేందుకే తమ కూటమి ప్రభుత్వం తొలిరోజు నుంచే పనిచేస్తోందని తెలిపారు. గడిచిన 16 నెలల్లో తమ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలకు పైగా విలువైన సంక్షేమ

వివరాలు 2లో..

## నటుడు విజయ్ టీవీకే గుర్తింపు పొందిన పార్టీ కాదు

- కరూర్ తొక్కిసలాట ఘటనలో 41 మంది మృతి
- టీవీకే పార్టీ గుర్తింపు రద్దు చేయాలని ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు
- గుర్తింపు లేనందున హోదా రద్దు అభ్యర్థన నిలబడదని కోర్టుకు తెలిపిన ఈసీ




**పెన్ పవర్ డెస్క్:**తమిళ నటుడు విజయ్‌కు చెందిన టీవీకే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ కాదని కేంద్ర ఎన్నికల సంఘం హైకోర్టు ధర్మాసనానికి నివేదించింది. కరూర్‌లో విజయ్ ప్రచార

వివరాలు 2లో..

## పరకామణి చోరీ కేసు: టీటీడీ ఈవోపై హైకోర్టు సీరియస్

- తిరుమల పరకామణి చోరీ కేసుపై హైకోర్టులో విచారణ
- కౌంటర్ దాఖలు చేయకపోవడంతో ఈవోపై ఆగ్రహం
- ఈ నెల 27న వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ ఈవోకు ఆదేశం



తిరుమల పరకామణిలో జరిగిన భారీ చోరీ కేసుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్రంగా స్పందించింది.

వివరాలు 2లో..

## అర్థం చేసుకోలేకపోతే నేనేం చేయాలి

### ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులపై కర్ణాటక సీఎం



- కర్ణాటకలో సామాజిక, ఆర్థిక సర్వేపై నారాయణమూర్తి దంపతులు అర్థం చేసుకోలేకపోతున్నారని వ్యాఖ్య
- రాష్ట్రంలో జరుగుతున్న సర్వేపై ఆ దంపతులకు కొన్ని అపోహలు ఉన్నాయన్న సిద్ధరామయ్య
- నారాయణమూర్తి దంపతులు భావిస్తున్నట్లు ఇది వెనుకబడిన వర్గాల సర్వే కాదన్న ముఖ్యమంత్రి

**పెన్ పవర్ డెస్క్:**కర్ణాటకలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక సర్వేను నారాయణమూర్తి దంపతులు అర్థం చేసుకోలేకపోతే తానేమీ చేయలేనని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేపై

వివరాలు 2లో..

## ఏపీ ఐపీఎస్ అధికారి సంజయ్ కస్టడీ పొడిగింపు

- సీనియర్ ఐపీఎస్ అధికారి సంజయ్ జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు
- అక్టోబర్ 31 వరకు రిమాండ్ విధించిన ఏసీబీ ప్రత్యేక కోర్టు
- ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో తీవ్ర ఆరోపణలు
- గతంలోనే సంజయ్ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన న్యాయస్థానం
- వైసీపీ ప్రభుత్వంలో సీఐడీ చీఫ్‌గా పనిచేసిన సంజయ్
- టెండర్ల ప్రక్రియలో అవకతవకలకు పాల్పడ్డారన్న అభియోగాలు

వివరాలు 2లో..




## ఏపీకి వర్ష సూచన... మూడు జిల్లాలకు అలర్ట్


- చురుగ్గా కదులుతున్న ఈశాన్య రుతుపవనాలు
- నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్ష సూచన
- పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం
- హెచ్చరికలు జారీ చేసిన విపత్తుల నిర్వహణ సంస్థ
- మరో 13 జిల్లాల్లో మోస్తరు వర్షాల అంచనా
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



**పెన్ పవర్ డెస్క్:**ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ముఖ్యంగా మూడు జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. విపత్తుల నిర్వహణ సంస్థ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, శనివారం నాడు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ వర్షాలు పిడుగులతో కూడి ఉండే ప్రమాదం ఉన్నందున, ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షం పడుతున్న సమయంలో చెట్లు, భారీ హోర్డింగులు, విద్యుత్ స్తంభాల కింద నిలబడటం సురక్షితం కాదని స్పష్టం చేశారు.

వివరాలు 2లో..

## నితీశ్ నాయకత్వంలోనే ఎన్నికలు.. కానీ సీఎం అభ్యర్థిపై మెలిక పెట్టిన అమిత్ షా!



- బీహార్ ఎన్డీయేలో విభేదాలు లేవన్న కేంద్రమంత్రి అమిత్ షా
- నితీశ్ కుమార్ నాయకత్వంలోనే ఎన్నికల బరిలోకి దిగుతామని స్పష్టీకరణ
- ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నికల తర్వాతే నిర్ణయిస్తామని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంటున్న తరుణంలో, ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో నితీశ్ కుమార్ నాయకత్వంలోనే కూటమి పోటీ చేస్తుందని స్పష్టం చేసిన ఆయన, ఎన్నికల తర్వాతే ముఖ్యమంత్రి ఎవరనేది నిర్ణయిస్తామని చెప్పి రాజకీయంగా ఆసక్తిని రేకెత్తించారు.

వివరాలు 2లో..



## భారతదేశ పురోగతికి నదులే రహదారులు

- జలమార్గాల అభివృద్ధిపై కేంద్ర మంత్రి సోనోవాల్ వ్యాసం షేర్ చేసిన ప్రధాని మోదీ
- 2014లో 5గా ఉన్న జాతీయ జలమార్గాలు ఇప్పుడు 111కి పెంపు
- పదేళ్లలో 18 నుంచి 145 మిలియన్ టన్నులకు చేరిన సరకు రవాణా
- రివర్ టూరిజంలోనూ భారీ వృద్ధి... 25 క్రూయిజ్ నౌకలు ఏర్పాటు
- వికసిత్ భారత్ లక్ష్యంలో జలమార్గాలే కీలకమన్న కేంద్రం

వివరాలు 2లో..

## మల్లన్న సాక్షిగా నీచ రాజకీయాలు చేశారు

- ప్రధాని మోదీపై ఎక్స్‌లో వైఎస్ షర్మిల విమర్శలు
- కర్నూలులో మోదీ దీపావళి టపాసు తుస్సుమందన్న షర్మిల
- ఏపీకి వచ్చి బీహార్ ఎన్నికల కోసం కాషాయ వేషమంటూ ఎద్దేవా



**పెన్ పవర్ డెస్క్:**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలు పర్యటనపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాని పర్యటన ఒక "తుస్సుమన్న దీపావళి టపాసు"లాంటిదని ఆమె ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి బీహార్ ఎన్నికల కోసం కాషాయ వేషం కట్టారని, శ్రీశైలం మల్లన్న సాక్షిగా నీచ రాజకీయాలకు తెరలేపారని

వివరాలు 2లో..

## మావోయిస్టు ఉద్యమానికి పెను దెబ్బ: ఒకేసారి 200 మంది లొంగుబాటు

- బస్తర్‌లో లొంగిపోనున్న మావోయిస్టులు
- సీఎం విష్ణు దేవ్ సాయి సమక్షంలో లొంగుబాటు కార్యక్రమం
- మావోయిస్టు ఉద్యమానికి తగిలిన అతిపెద్ద ఎదురుదెబ్బ
- ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం విజయవంతం
- రెండు రోజుల్లోనే 258 మంది మావోల లొంగుబాటు



**పెన్ పవర్ డెస్క్:**ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ఉద్యమానికి అతిపెద్ద ఎదురుదెబ్బ తగిలింది. దండకారణ్యం ప్రాంతానికి చెందిన సీనియర్ నాయకులు సహా సుమారు 200 మంది

వివరాలు 2లో..




## లోకేష్ మార్క్ ఎకోసిస్టమ్

ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోనే అతి పెద్ద డేటా సెంటర్ రావడం సంచలనంగా మారింది. ఇష్టం లేని వాళ్లు అదో నిరర్థక పెట్టుబడి అంటున్నారు. భారీ రాయితీలు ఇచ్చారని అంటున్నారు. ఎవరి వాదన వారు చెబుతున్నారు. కానీ ఆ పెట్టుబడి ఎంత ముఖ్యమైనదో.. ఇండస్ట్రీ గుర్తించింది. అందుకే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ను వారు చూస్తున్నారు. ఏపీలో వేగంగా సాగుతున్న మౌలిక సదుపాయాల నిర్మాణాలు, ఎకో సిస్టమ్ ఏర్పాటు వంటివి ముందు ముందు పెట్టుబడుల వెల్లువకు కారణం కాబోతున్నాయని ఇప్పటికే ఇండస్ట్రీ వర్గాల్లో స్పష్టత ఉంది.ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు పారిశ్రామిక వర్గాలకు మొదటి చాయిస్ గా మారింది. ఏపీ ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు అందర్నీ ఆకర్షిస్తున్నాయి. నిజానికి ఏపీకి రావాల్సిన అవసరం ఏ పారిశ్రామిక సంస్థకూ లేదు. ఎందుకంటే ఏపీకి మూడు వైపులా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు ఉన్నాయి. ఆ నగరాలు ఉన్న మూడురాష్ట్రాలు పారిశ్రామికంగా ఎంతో ముందు ఉన్నాయి. వాటి వైపు వెళ్లకుండా.. ఏపీకి పరిశ్రమల్ని తీసుకురాగలగడం చిన్న విషయం కాదు. కానీ పదహారు నెలల్లోనే అలాంటి సమస్యల్ని పరిష్కరించి ఏపీ పారిశ్రామిక వర్గాలను ఆకట్టుకుంటోంది.ఏపీతో చర్చలు జరిపేందుకు పెద్ద ఎత్తున పారిశ్రామికవర్గాలు ఆసక్తి చూపిస్తున్నాయి. గతంలో చర్చలు జరిపిన ఫాక్స్ కాన్ వంటి సంస్థలు ఇప్పుడు తమ పెట్టుబడుల ప్రణాళికల్ని వేగవంతం చేసేందుకు ముందుకు వస్తున్నాయి. గూగుల్ డేటా సెంటర్ కారణంగా అక్కడ తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు పెద్ద ఎత్తున ఇతర సంస్థలూ ముందుకు వస్తున్నాయి. కాగ్నిజెంట్ , యాక్సెంచర్ లాంటివే కాదు.. మధ్యస్థ ఐటీ కంపెనీలు కూడా పెద్ద ఎత్తున తమ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నాయి.విశాఖలో నవంబర్‌లో జరగనున్న పెట్టుబడుల సదస్సులో పాల్గొనే .. ప్రపంచప్రసిద్ధ పారిశ్రామిక వేత్తల సంఖ్య గూగుల్ పెట్టుబడి కారణంగా పెరిగే అవకాశం ఉంది. అత్యంత ప్రతిష్టాత్మకంగా సీఐఐ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సదస్సు రాష్ట్ర పెట్టుబడుల చరిత్రను తిరిగరాసే అవకాశం ఉంది. అందు కోసం చాలా కాలం నుంచే ప్రభుత్వం కసరత్తు చేస్తోందిఐదు సంవత్సరాల్లో ఇరవై లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా నారా లోకేష్ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోంది. ఎంవోయూలు చేసుకుని టైంపాస్ చేయాలని ఆయన అనుకోవడం లేదు. నేరుగా ఎగ్జిక్యూషన్ కే ప్రాధాన్యం ఇస్తున్నారు. పనులు ప్రారంభించేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. అందుకే.. పెట్టుబడులు గ్రౌండింగ్ కోసం ఎదురు చూడాల్సిన పనిలేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లోకేష్ మార్క్ ఎకోసిస్టమ్ ఏపీని పెట్టుబడుల స్వర్గధామంగా మార్చనుంది.

## భారతదేశ పురోగతికి నదులే రహదారులు

భారతదేశ నదులు కేవలం వారసత్వ చిహ్నాలు మాత్రమే కావని, అవి దేశ ప్రగతికి కొత్త రహదారులుగా మారాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. గత కొన్నేళ్లుగా దేశంలో జలమార్గాలను అభివృద్ధి చేయడం ద్వారా రవాణా, పర్యాటక రంగాలు బలోపేతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ రాసిన ఒక ప్రత్యేక కథనాన్ని ప్రధాని శుక్రవారం తన 'ఎక్స్' సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు."వికసిత్ భారత్ నిర్మాణం దిశగా పునరుజ్జీవం పొందిన మన జలమార్గాలు ఎలా పయనిస్తున్నాయో" వివరిస్తూ సోనోవాల్ ఈ వ్యాసాన్ని రాశారు. ఒకప్పుడు మన దేశంలో నదులే ప్రధాన రవాణా మార్గాలుగా ఉండేవని, రోడ్లపై ట్రక్కుల హవా పెరగకముందే పట్నా, దిబ్రూగఢ్ వంటి ప్రాంతాల నుంచి కోల్‌కతాకు సరుకులు నదుల మీదుగానే చేరేవని సోనోవాల్ గుర్తుచేశారు. "భారత నదులే మన తొలి హైవేలు. కాలక్రమేణా రైలు, రోడ్డు మార్గాలు రావడంతో వాటి ప్రాధాన్యం తగ్గింది" అని ఆయన తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం, భారత అంతర్గత జలమార్గాల ప్రాధికార సంస్థ (ఐడబ్ల్యూఏఐ) కృషితో ఇప్పుడు నదులకు మళ్లీ పూర్వ వైభవం వస్తోందని సోనోవాల్ వివరించారు. 2014 వరకు దేశంలో కేవలం 5 జాతీయ జలమార్గాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 111కి పెరిగిందని, వీటిలో 32 ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్నాయని ఆయన వెల్లడించారు. ఈ మార్పు వల్ల తక్కువ ఇంధన వినియోగం, తక్కువ కాలుష్యం, చౌకైన రవాణా వంటి ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు.జలమార్గాల ద్వారా సరకు రవాణాలో అద్భుతమైన పురోగతి కనిపిస్తోందని గణాంకాలతో సహా వివరించారు. 2013-14లో కేవలం 18 మిలియన్ టన్నులుగా ఉన్న సరకు రవాణా, 2024-25 నాటికి 145 మిలియన్ టన్నులకు పెరిగిందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో 2030 నాటికి 200 మిలియన్ టన్నులు, 2047 నాటికి 250 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుందని తెలిపారు.

అదే సమయంలో నదీ పర్యాటకం (రివర్ టూరిజం) కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని సోనోవాల్ అన్నారు. దశాబ్దం క్రితం కేవలం 5 క్రూయిజ్ నౌకలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 13 జలమార్గాల్లో 25 క్రూయిజ్ నౌకలు సేవలందిస్తున్నాయని చెప్పారు. గంగా, బ్రహ్మపుత్ర, కేరళ బ్యాక్‌వాటర్స్ ఈ రంగంలో ముందున్నాయని, వారణాసి, కోల్‌కతా, పాట్నా, గౌహతి వంటి టెర్మినల్లను ఆధునికీకరిస్తున్నామని ఆయన తన వ్యాసంలో పేర్కొన్నారు.

# ఏపీ ఐపీఎస్ అధికారి సంజయ్ కస్టడీ పొడిగింపు

ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐపీఎస్ అధికారి ఎన్. సంజయ్‌కు ఏసీబీ ప్రత్యేక కోర్టులో మరోసారి చుక్కెదురైంది. ఆయన జ్యుడీషియల్ కస్టడీని న్యాయస్థానం అక్టోబర్ 31 వరకు పొడిగించింది. శుక్రవారం కస్టడీ గడువు ముగియడంతో ఏసీబీ అధికారులు సంజయ్‌ను కోర్టు ముందు హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయమూర్తి, ఆయన రిమాండ్‌ను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన్ను తిరిగి విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. కాగా, ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు అక్టోబర్ 13న తిరస్కరించిన విషయం తెలిసిందే.1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన సంజయ్, రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల డీజీగా, సీఐడీ అదనపు డీజీగా బాధ్యతలు నిర్వర్తించారు. 2023లో అగ్నిమాపక శాఖ కోసం 'అగ్ని-ఎన్‌ఓసీ' వెబ్ పోర్టల్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ కాంట్రాక్టును ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించడంలో టెండర్ల నిబంధనలను ఉల్లంఘించారని ఆయనపై ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. టెండర్లు పిలవకుండానే కొన్ని పరికరాలను కొనుగోలు చేసేందుకు ఆదేశాలు ఇచ్చారని ఏసీబీ కేసు నమోదు చేసింది. ప్రైవేట్ కంపెనీలకు చెల్లింపులు, ప్రాజెక్టుల అమలులో జరిగిన అవకతవకలపైనా ఏసీబీ దర్యాప్తు చేస్తోంది.

ఈ కేసులో తొలుత ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సంజయ్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు తీర్పును తప్పుబట్టిన సర్వోన్నత న్యాయస్థానం, మూడు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆయన ఆగస్టు 26న ఏసీబీ కోర్టులో లొంగిపోయారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్‌గా ఉన్న సంజయ్, అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబుపై నమోదైన స్కిల్ డెవలప్‌మెంట్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ కేసుల దర్యాప్తును పర్యవేక్షించారు. ఆ కేసుల్లో చంద్రబాబు అరెస్ట్ అయి సుమారు రెండు నెలల పాటు జైలులో ఉన్నారు. 2024 జూన్‌లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత, సంజయ్‌ను బదిలీ చేసి డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయనపై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం సంజయ్‌ను సస్పెండ్ చేయగా, ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తోంది.

## తిరుపతి కలెక్టరేట్‌ను బాంబులతో పేల్చేస్తాం'

- మొదటి పేజి తరువాయి

సిద్ధంగా ఉండండి" అని అందులో హెచ్చరించారు. అధికారులు వెంటనే దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించారు. ప్రాథమిక దర్యాప్తులో ఈ మెయిల్ తమిళనాడు ఐపీ అడ్రస్ నుంచి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు.

**గంటలపాటు క్షుణ్ణంగా తనిఖీలు**

ఈ మెయిల్ సమాచారం అందిన వెంటనే, తిరుపతి పోలీస్ కమిషనర్ డాక్టర్ వి. సురేష్ కుమార్, ఎస్పీ కె. రమణ ఆధ్వర్యంలో భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. శుక్రవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాయి. కలెక్టర్ ఛాంబర్, జాయింట్ కలెక్టర్ కార్యాలయం, ఇతర శాఖల గదులు, పార్కింగ్ ప్రాంతంతో పాటు సమీపంలోని భవనాలను కూడా గంటల తరబడి జల్లెడ పట్టాయి. ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు గానీ, అనుమానాస్పద వస్తువులు గానీ లభించకపోవడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.గత 15 రోజులుగా తిరుపతి కలెక్టరేట్‌కు ఇలాంటి బెదిరింపు మెయిల్స్ వస్తూనే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో సాధారణ హెచ్చరికలతో మెయిల్స్ రాగా, ఈసారి నేరుగా పేల్చివేస్తామని బెదిరించడంతో అధికారులు దీన్ని మరింత తీవ్రంగా పరిగణిస్తున్నారు.

ఈ ఘటనపై కలెక్టర్ డాక్టర్ ప్రారంభ్ దాస్ స్పందిస్తూ, ప్రజల భద్రతకు ఎలాంటి ఆటంకం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, పోలీసులతో కలిసి దర్యాప్తును వేగవంతం చేస్తున్నామని తెలిపారు. పోలీస్ కమిషనర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ, "ఇలాంటి మెయిల్స్ పంపడం చట్టవిరుద్ధం. దీని వెనుక ఉన్న వారిని తప్పకుండా పట్టుకుంటాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు.

## ఏపీకి వర్ష సూచన... మూడు జిల్లాలకు అలర్ట్

- మొదటి పేజి తరువాయి

రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు పొలాల్లో ఉండవద్దని ప్రత్యేకంగా సూచించారు.ఇదే సమయంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా, ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. ఈ ప్రాంతాల్లో కూడా పిడుగులు పడే అవకాశం ఉందని పేర్కొంది. మిగిలిన జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ప్రజలు వాతావరణ శాఖ హెచ్చరికలను గమనిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ కోరింది.

## ఈ పథకంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

- మొదటి పేజి తరువాయి

, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని ముఖ్యమంత్రి వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతినెలా రూ. 2,758 కోట్లతో 'ఎన్టీఆర్ భరోసా పింఛన్లు' అందిస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 207 'అన్నా క్యాంటీన్లను' పునఃప్రారంభించి, కేవలం రూ. 5కే పేదల ఆకలి తీరుస్తున్నామని పేర్కొన్నారు. 'దీపం 2.0' పథకం ద్వారా పేద మహిళలకు ఏడాదికి 3 వంటగ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.పేద కుటుంబాల పిల్లలు చదువులో రాణించాలనే ఉద్దేశంతో, ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ 'తల్లికి వందనం' కింద ఏటా రూ. 15,000 చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నామని చంద్రబాబు అన్నారు. 'స్త్రీ శక్తి' పథకంతో మహిళలందరికీ

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. అదేవిధంగా, 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు తొలి విడతగా రూ. 7,000 జమ చేశామని, మత్స్యకారులకు రూ. 246 కోట్లు, ఆటో డ్రైవర్లకు రూ. 435 కోట్లు అందించామని ఆయన తన పోస్ట్‌లో వివరించారు.

## పరకామణి చోరీ కేసు: టీటీడీ ఈవోపై హైకోర్టు సీరియస్

- మొదటి పేజి తరువాయి

ఈ వ్యవహారంలో ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యనిర్వహణాధికారి (ఈవో) వ్యక్తిగతంగా హాజరు కావాలని కఠిన ఆదేశాలు జారీ చేసింది.శుక్రవారం ఈ కేసు విచారణ సందర్భంగా, టీటీడీ అధికారుల తీరుపై న్యాయమూర్తి అసహనం ప్రదర్శించారు. కౌంటర్ దాఖలు చేయడంలో జాప్యంపై ప్రశ్నించారు. ఈ నెల 27న జరిగే తదుపరి విచారణకు ఈవో కచ్చితంగా హాజరుకావాలని, లేనిపక్షంలో రూ. 20 వేల జరిమానా విధించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కావాలని టీటీడీ తరఫు న్యాయవాది కోరడంతో, కోర్టు ఈ విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది. కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీఐడీ అధికారులు, ఇప్పటికే తిరుమల పరకామణిలోని కీలక దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తునకు సంబంధించిన ప్రాథమిక నివేదికను, సీజ్ చేసిన ఫైళ్లను శుక్రవారం కోర్టుకు సమర్పించారు.గతంలో రవికుమార్ అనే ఉద్యోగి పరకామణిలో భారీగా అవకతవకలకు పాల్పడినట్లు 2023లో ఆరోపణలు వచ్చాయి. అయితే, అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ అధికారులు ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ జరపకుండా లోకాయుక్త ద్వారా రాజీ కుదిర్చారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, శ్రీనివాసులు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో న్యాయస్థానం ఈ కేసును సీరియస్‌గా తీసుకుని విచారణ జరుపుతోంది.

## నితీశ్ నాయకత్వంలోనే ఎన్నికలు.. కానీ సీఎం అభ్యర్థిపై మెలిక పెట్టిన అమిత్ షా!

- మొదటి పేజి తరువాయి

బీహార్‌లోని అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల పంపకాలపై విభేదాలు తలెత్తాయని, పార్టీల మధ్య మనస్పర్థలు వచ్చాయని మీడియాలో వస్తున్న వార్తలపై అమిత్ షా స్పందించారు. అవన్నీ నిరాధారమైన కథనాలని, వాటిలో ఎలాంటి నిజం లేదని కొట్టిపారేశారు. కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, అన్ని మిత్రపక్షాలు ఐక్యంగానే ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభ్యర్థి గురించి అమిత్ షా మాట్లాడుతూ, "నితీశ్ కుమార్ సీఎం అవుతారా? లేదా? అని నిర్ణయించేది నేను కాదు. ప్రస్తుతానికి ఆయన నాయకత్వంలోనే మేము ఎన్నికలకు వెళుతున్నాం. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బీజేపీ, దాని మిత్రపక్షాలన్నీ కలిసి కూర్చొని తమ నాయకుడిని ఎన్నుకుంటాయి" అని వివరించారు. ఈ వ్యాఖ్యలతో సీఎం అభ్యర్థిపై ఒకరకమైన సస్పెన్స్‌ను కొనసాగించారు.

2020 ఎన్నికల నాటి పరిస్థితులను ఆయన గుర్తుచేశారు. "గత ఎన్నికల్లో జేడీయూ కన్నా బీజేపీ ఎక్కువ స్థానాలు గెలుచుకుంది. ఆ సమయంలో నితీశ్ కుమార్ స్వయంగా ప్రధాని మోదీని కలిసి, బీజేపీ నుంచే ముఖ్యమంత్రి ఉండాలని ప్రతిపాదించారు. కానీ, మేము మిత్రపక్షానికి, సీనియారిటీకి ఎప్పుడూ గౌరవం ఇస్తాం. అందుకే నితీశ్‌ను సీఎం చేశాం" అని అమిత్ షా తెలిపారు.

కాగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో జరగనున్నాయి. నవంబర్ 6న తొలి దశ, నవంబర్ 11న రెండో దశ పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గత రికార్డులన్నింటినీ బద్దలు కొట్టి ఘన విజయం సాధిస్తుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

## అర్థం చేసుకోలేకపోతే నేనేం చేయాలి

- మొదటి పేజి తరువాయి

ఆ దంపతులకు కొన్ని అపోహలున్నాయని, ఇది వెనుకబడిన వర్గాల సర్వే అనే అభిప్రాయంతో వారు ఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు.

కర్ణాటకలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక సర్వేను ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులు తిరస్కరిస్తూ, తమది వెనుకబడిన వర్గాలకు చెందిన కుటుంబం కాదని, ఈ సమీక్షలో పాల్గొనడం వల్ల కమిషన్‌కు లేదా ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం చేకూరదని అన్నారు. దీనిపై సిద్ధరామయ్య స్పందించారు.ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులు భావిస్తున్నట్లుగా ఇది వెనుకబడిన తరగతుల సర్వే కాదని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ఇది ఏడు కోట్ల జనాభా సర్వే అని ఇప్పటికి ఇరవై సార్లు చెప్పామని అన్నారు. వారు ఏది కావాలంటే అది రాసుకోనివ్వండని, ఈ సర్వే దేని గురించో ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. నారాయణమూర్తి దంపతులు అర్థం చేసుకోకుంటే తానేం చేయగలనని ఆయన ప్రశ్నించారు.రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని, ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు నెలకు రూ. 2 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ఈ పథకాల్లో అగ్రవర్ణ మహిళలు, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న మహిళలులేరా అని సిద్ధరామయ్య ప్రశ్నించారు. ఈ సర్వేపై పలుమార్లు ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చినప్పటికీ వారి అపోహలు తొలగిపోలేదని ఆయన అన్నారు. కేంద్రం ఇప్పుడు కులగణనతో ముందుకు వస్తుందని, దీనిపై నారాయణమూర్తి దంపతులు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు.

## మల్లన్న సాక్షిగా నీచ రాజకీయాలు చేశారు

- మొదటి పేజి తరువాయి

ఎక్స్ వేదికగా ఆరోపించారు. రాష్ట్ర ప్రజలను మరోసారి ఘరానా మోసం చేశారంటూ మండిపడ్డారు.శ్రీశైలం క్షేత్ర అభివృద్ధి విషయంలో ప్రధాని మోదీకి చిత్తశుద్ధి లేదని షర్మిల విమర్శించారు. "మల్లన్న ఆలయ అభివృద్ధికి ఒక్క రూపాయి అయినా ఇచ్చారా? రూ. 1,657 కోట్లతో పెండింగ్‌లో ఉన్న మాస్టర్ ప్లాన్ మీకు కనిపించలేదా?" అని ఆమె ప్రశ్నించారు. ఉజ్జయిని, వారణాసి కారిడార్ల అభివృద్ధిపై చూపుతున్న శ్రద్ధ శ్రీశైలం మల్లన్న కారిడార్‌పై ఎందుకు లేదని నిలదీశారు. శ్రీశైలం కారిడార్ నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతులు ఇవ్వడానికి ఎందుకు మనసు రావడం లేదని, ఇది మల్లన్నకు చేస్తున్న ద్రోహం కాదా? అని అన్నారు.

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై కూడా షర్మిల పలు ప్రశ్నలు లేవనెత్తారు. 11 ఏళ్ల క్రితం తిరుపతిలో చెప్పిన పాత పిట్టకథనే ప్రధాని మళ్లీ చెప్పారని విమర్శించారు. ఢిల్లీకి, రాష్ట్ర రాజధానికి లింక్ పెట్టారని, కానీ అరకొర అప్పులు ఇస్తే అమరావతి ఢిల్లీతో

ఎలా పోటీ పడుతుందని ప్రశ్నించారు. కేవలం అప్పులకు హామీలు ఇచ్చినంత మాత్రాన రాష్ట్రం ప్రగతి పథంలో పరుగులు పెడుతుందా? అని నిలదీశారు. రాజధానికి లక్ష కోట్ల అప్పులు తెస్తే రాష్ట్ర ముఖచిత్రం ఎలా మారుతుందని, ప్రగతి ద్వారాలు ఎలా తెరుచుకుంటాయని ఆమె అన్నారు.

## నటుడు విజయ్ టీవీకే గుర్తింపు పొందిన పార్టీ కాదు

- మొదటి పేజి తరువాయి

సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో విజయ్ పార్టీ గుర్తింపును రద్దు చేయడంతో పాటు రాజకీయ పార్టీల ప్రచార సభల్లో మహిళలు, చిన్నారులు పాల్గొనకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి.వీటిని సీజే జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ, జస్టిస్ జీ అరుల్ మరుగణ్‌ల ధర్మాసనం విచారించింది. ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది నిరంజన్ రాజగోపాల్ కోర్టులో వాదనలు వినిపించారు. టీవీకే పార్టీకి గుర్తింపు లేనందున ఆ పార్టీకి ఆ హోదా రద్దు చేయాలనే అభ్యర్థన నిలబడదని కోర్టుకు తెలిపారు.మరోవైపు, కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు మినహా ఈ కేసుల విచారణకు ఒక ధర్మాసనాన్ని ఏర్పాటు చేసేందుకు వీలుగా వాటన్నింటినీ హైకోర్టు పాలనా వ్యవహారాల విభాగం ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

## మావోయిస్టు ఉద్యమానికి పెను దెబ్బ: ఒకేసారి 200 మంది లొంగుబాటు

- మొదటి పేజి తరువాయి

మావోయిస్టులు శుక్రవారం ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలో కలవనున్నారు. బస్తర్‌లో ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి సమక్షంలో ఈ చారిత్రాత్మక లొంగుబాటు కార్యక్రమం జరగనుంది. కొన్నేళ్లుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు పెనుసవాలుగా మారిన మావోయిస్టు ఉద్యమాన్ని ఈ ఘటన తీవ్రంగా దెబ్బతీసింది.ప్రభుత్వ విధానాలు, భద్రతా బలగాల కృషితోనే ఇది సాధ్యమైందని బస్తర్ ఐజీ పి. సుందర్‌రాజ్ తెలిపారు. మావోయిస్టు ఉద్యమాన్ని బలహీనపరచడంలో తాము సఫలమవుతున్నామని చెప్పడానికి ఈ భారీ లొంగుబాటే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. హింసను వీడి వచ్చే మావోయిస్టుల కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అమలు చేస్తున్న లొంగుబాటు, పునరావాస విధానం సత్ఫలితాలనిస్తోంది. ఈ విధానం కింద లొంగిపోయిన వారికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు, వారు తిరిగి సమాజంలో గౌరవంగా బతికేందుకు అవసరమైన తోడ్పాటును ప్రభుత్వం అందిస్తోంది.

గత కొద్ది రోజులుగా మావోయిస్టుల లొంగుబాట్లు గణనీయంగా పెరిగాయి. కేవలం ఒక్క రోజు క్రితమే టాప్ కమాండర్ రూపేశ్‌తో సహా 170 మంది లొంగిపోయారు. అంతకుముందు, అక్టోబర్ 15న సుక్మా జిల్లాలో రూ.50 లక్షల సమష్టి బహుమతి ఉన్న 27 మంది మావోయిస్టులు ఆయుధాలు అప్పగించారు. గత రెండు రోజుల్లో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 258 మంది లొంగిపోయినట్లు తెలుస్తోంది.మరోవైపు,

2026 మార్చి 31 నాటికి దేశం నుంచి మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టం చేశారు. హింసను వీడి జనజీవన స్రవంతిలో చేరాలని, వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన మావోయిస్టులకు పిలుపునిచ్చారు. ఉద్యమంలోని అంతర్గత విభేదాలు, స్థానిక ప్రజల నుంచి మద్దతు కరువవడం వంటి కారణాలతో మావోయిస్టులు లొంగుబాటుకు మొగ్గుచూపుతున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు



# అశ్వవాహన సేవలో కల్కి అవతార సౌందర్యం భక్తులను మంత్రముగ్ధుల్ని చేసింది

## కల్పవృక్ష వాహన సేవలో స్వామివారి మహామహిమ వెలిగింది





**ఆత్రేయపురం, పెన్ పవర్, అక్టోబర్ 17:**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి పరవశంతో, ఆధ్యాత్మిక జ్యోతితో కళకళలాడుతున్నాయి. భక్తజన సమూహం మధ్య వేదఘోషల నడుమ ప్రతీ రోజు స్వామివారి వాహన సేవలు ఆరంభమవుతుండగా, క్షేత్రం సాక్షాత్ వైకుంఠమయంగా మారింది.శుక్రవారం జరిగిన ఎనిమిదవ రోజు ఉత్సవాలు భక్తులను మరింత ఆధ్యాత్మికానందంలో ముంచెత్తాయి. ఉదయం స్వామివారు కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కల్పవృక్ష రూపంలో దర్శనమిచ్చిన స్వామివారు భక్తుల మనోభిలాషలను నెరవేర్చే సకలసిద్ధిదాయకుడిగా అభివర్ణింపబడ్డారు. గానములు, వేదఘోషలు, మంగళవాయిద్యాల నాదములు, గోవింద నామస్మరణలతో వాడపల్లి ఆలయ ప్రాంగణం దివ్యవాతావరణంగా మారింది.మధ్యాహ్నం పుణ్యాహవచనం, విష్వక్సేన పూజ, మహాస్నపనం, లక్షకుంకుమార్చన, ప్రధాన హోమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. పవిత్ర గోదావరి జలాలతో స్వామివారికి అభిషేకం జరిపి, మంత్రపుష్పార్చనతో పూజలు సమర్పించారు.సాయంత్రం కల్కి అవతార అలంకరణలో స్వామివారు అశ్వవాహనంపై మాడ వీధుల్లో విహరించారు. ఆ దివ్య దర్శనం చూసిన ప్రతి భక్తుడి కన్నుల్లో ఆనందభాష్పాలు మెరుస్తూనే ఉన్నాయి. ధర్మస్థాపన కోసం కల్కి అవతారంగా స్వామివారు ఆవిర్భవించినట్టుగా అనిపించిందని భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.ఈ అశ్వవాహన సేవలో అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అనంత కుమారి, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, కోనసీమ జాయింట్ కలెక్టర్ నిశాంతి దర్శన భాగ్యం పొందారు.ఆలయ వేదపండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో మహాలక్ష్మీ హోమము, దిగ్దేవతా బలిహరణ, తీర్థప్రసాద విహిత కార్యక్రమాలు నిర్వహించారు.ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు దంపతులు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు దంపతులు, సూపరింటెండెంట్ పులపత్తి రాంబాబు, రాపాక శ్రీనివాసరావు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారు.పుష్పాల పరిమళం, దీపాల వెలుగు, వేదఘోషల నాదం నడుమ వాడపల్లి క్షేత్రం స్వర్గసమాన దివ్యక్షేత్రంగా మారి ం "ఓం నమో వెంకటేశాయ" నినాదాలతో భక్తులు పరమానందంలో మునిగిపోయారు











# అనుమతులు లేని ఇటుక బట్టీలపై చర్యలేవి .





- అక్రమంగా మట్టి ,చెట్లు ,విద్యుత్.
- అదుపు చేయలేని రెవిన్యూ యంత్రం.

**రౌతులపూడి పెన్ పవర్ అక్టోబర్ 17.**
ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీ వ్యాపారులు దందా నిర్వహిస్తున్నా రు. మండలంలోని స్థానిక రౌతులపూడి, బంగారయ్యపేట, గిడజాం, బలరాంపురం, రాజవరం ,శృంగవరం ,మెరక చామవరం, పల్లపు చామవరం, గుమ్మరేగుల గ్రామంలో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా అనధికార ఇటుక వ్యాపారం కొనసాగిస్తున్నారు. వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘించిన ప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు మండలంలో వెల్లువెత్తుతూన్నా యి. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములకు వినియోగిస్తే నాలా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వ్యాపారులు పన్నుల చెల్లింపును పట్టించుకోవడం లేదు మండల పరిషత్ అధికారులకు తెలుసు. కాలుష్య నియంత్రణ, భూగర్భ జల వనరులు, పంచాయతీలు, కార్మిక శాఖ, విద్యుత్ శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఎలాంటి అనుమనుతులు లేకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారు రెవిన్యూ అధికారులకు బాగా ఎరికే . వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కుతూ చెరువులు, వాగులు, ప్రభుత్వ స్థలాల నుంచి ఇటుకలకు అవసరమైన మట్టిని రెవిన్యూ, మైనింగ్ సహకారంతోనే సేకరిస్తున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి రాయల్టీ చెల్లించడం లేదు. ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులకు ఎలాంటి భరోసా లేకుండా శ్రమ దోపిడీ జరుగుతుందని కార్మికులు వాపోతున్నారు డివిజనల్ లేబర్ అధికారులకు బాహుగా తెలుసు. ఒరిస్సా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి కార్మికులనుతక్కువ డబ్బులకు తీసుకువచ్చి పని చేయించుకుంటున్నారు. ముందుగా కొంత డబ్బు వారికి అడ్వాన్సుగా ఎరవేసి తక్కువ రూపాయలకు ఇక్కడికి తీసుకువచ్చి శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని కార్మికులు మండిపడుతున్నారు. పచ్చని పల్లెల్లో నివసిస్తున్న ప్రజలు ఇటుక బట్టీలు నుంచి వచ్చే వాయు కాలుష్యంతో ఇబ్బందులు ఎదురుకుంటున్నారు. సదరు బట్టీల యాజమాన్యాలు గత కొన్ని సంవత్సరాలుగా గ్రామపంచాయితీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా,లేబర్ లైసెన్స్, ఇండ్రస్టియల్, ఎలాటి ఇతర ముందస్తు అనుమతులు లేకుండా నిర్వహణ చేపట్టారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర ప్రయోజనాలకు అంటే పారిశ్రామిక, వాణిజ్య,నివాస అవసరాలు మార్చడానికి ముందస్తుగా నాలా పర్మిషన్ సంబంధిత తహసీల్దార్ వద్ద అగ్రికల్చరల్ ల్యాండ్ అసెస్మెంట్ యాక్ట్ కింద పర్మిషన్ తీసుకోకుండా మండలంలో సుమారు 25 ఇటుక బట్టీలు కొనసాగిస్తు న్నారు దీనికి మండల రెవెన్యూ అధికారులు మెండుగా సహకరిస్తున్నారు . దానితో పాటు నాలా అనుమతులు లేకుండా వ్యవసాయ భూమిగా కొనసాగించడం వల్ల ఆ భూస్వామిలకు రైతు భరోసా డబ్బులు ఖాతాలో జమ అయ్యాయి. వ్యాపారం కొనసాగుతున్న భూమికి వ్యవసాయం భూమి అంటూ ఎలా డబ్బులు ఇచ్చారని వ్యవసాయ అధికారులను పలువురు ప్రశ్నిస్తున్నారు.ఇంత జరుగుతున్నా అధికారులు అధికారిక బాధ్యతలు చేపట్టకపోవడంపై అధికారులపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జీవో నంబర్ 80 నిబంధనలు ప్రకారం ఇండస్ట్రియల్ పర్మిషన్, లేబర్ లైసెన్స్,ఇతర నియమ, నిబంధనలు ఇటుక బట్టీల యజమానులు ఎవ్వరూ అనుసరించడం లేదు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. నాలా అనుమతులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పైన తెలిపిన గ్రామాలలో రోడ్డు ప్రక్కనే ఇటుక బట్టీలు నిర్వహణ లో ఉపయోగించే బూడిద వాహనదారులకు, బాటసారులకు కళ్ళల్లో పడి అనేక ప్రమాదాలు జరుగుతూనే ఉంటున్నారు. బంగారయ్య పేట, బలరాం పురం ఇటుక బట్టిలలో 13 సంవత్సరము ద బాల కార్మికుడు, ముగ్గురు పిల్లల సంతానము కలిగిన 36సంవత్సరముల కార్మికుడు .మట్టిమల్లను తొక్కిస్తూ ట్రాక్టర్లు వెనుకకు తిరగబడి మట్టిలో కూరికిపోయి మరణించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయ యి. వీటిపై కూడా అధికారులు ఏమాత్రం స్పందించలేదని మండల ప్రజలు బహిరంగ ఆరోపిస్తున్నారు. ఈ ఇటుక బట్టీల నిర్వహణలో బాల కార్మికులే బట్టి కార్మికులు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, అనధికార ఇటిక బట్టి యాజమాన్యంపై సంబంధిత శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## వీధి దీపాల నిర్వహణ.. అధికారులకు పట్టదా?



**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ 17:**ప్రభుత్వ ధనాన్ని పోదుపుగా వినియోగించి, వృధాను అరికట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. విద్యుత్ పెద్ద ఎత్తున వృధా అవుతున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. వీధి దీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా వెలుగుతూ ఉన్నాయి. వీటిని కట్టడి చేయాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోవట్లేదు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రఘుదేవపురం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామంలో విద్యుత్ దీపాలు నిరంతరాయంగా వెలుగుతూ ఉన్నాయి. విద్యుత్తు వృధా వల్ల పంచాయతీల పై ఎనలేని ఆర్థిక భారం పడుతుందని ప్రజా ప్రతినిధులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి విద్యుత్ వృధాను ఆరికట్టి పోదుపు చర్యలు చేపట్టాలని ప్రజలు ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

## సూపర్ జిఎస్టి పేదలకు సూపర్ సేవింగ్స్

- ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ స్మరణ రాజ్





**రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్17:**భారతదేశంలో పేద బడుగు బలహీన వర్గాల వారికి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ద్వారా భారీగా వివిధ వస్తువులపై పన్నులు తగ్గించడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో ఏడు మండలాలకు సంబంధించిన మహిళా సంఘాల సభ్యులతో, వర్తక సంఘాలతో, అంగన్వాడి టీచర్లతో, అంగన్వాడి ఆయాలతో,వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో సిబ్బందితో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమానికి రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ మన భారతదేశంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ద్వారా పేద బడుగు వర్గాల వారికి వివిధ రకాలైన వస్తువులు కొనుగోలు చేసిన వారికి ఈ సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ద్వారా ప్రతిరోజు నిత్యవసరాల వస్తువులకు ఉపయోగిస్తున్న సామాన్య ప్రజలకు 0 శాతం నుండి 5 శాతం వరకు వివిధ నిత్యవసర వస్తువులకు పన్ను లు చాలావరకు తగ్గించడం జరిగిందని ఆయన అన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పై మండలాల పరిధిలోగల సచివాలయాల గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ద్వారా ట్రాక్టర్లు, కార్లు, రెండు చక్రాల వాహనాలకు అదేవిధంగా ఎలక్ట్రానిక్ పరికరాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం భారీగా రేట్లు తగ్గించడం జరిగిందని ఆయన అన్నారు. ఏజెన్సీలోని మహిళ తల్లులు ఇంటికి కావలసిన వివిధ రకాలైన ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేసిన వారికి ఇకనుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా రేట్లు తగ్గించడం జరిగిందని ఆయన అన్నారు. అదేవిధంగా ముందుగా రాజమండ్రి వాస్తవ్యులు విభూతి లోవరాజు, వి.రాంప్రసాద్, వి, రఘురాం బుర్రకథ కార్యక్రమం ద్వారా ప్రజలకు జీఎస్టీ పై అర్థమయ్యే రీతిలో వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఏపీఓ జనరల్ డిఎన్వి రమణ, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె. రామ మోహన్ రావు,ఎంపీడీవో వై. రాజబాబు,ఏవో పి. జయంతి,డిప్యూటీ తహసిల్దార్ స్వామి,అన్ని మండలాలకు సంబంధించిన మహిళా సంఘల సభ్యులు, అంగన్వాడి టీచర్లు,వర్తక సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణలు తొలగింపుకు సన్నద్ధం కానున్న పంచాయతీ సిబ్బంది

**వై రామవరం, పెన్ పవర్, అక్టోబర్ 17 :** మండల కేంద్రమైన వైరామవరంలో గ్రామకంఠం అక్రమణలలో ఉన్న 51మందికి పంచాయతీ సెక్రటరీ నోటీసులు జారీ చేశారు.

ఈనెల 18 లోగా ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించాలని, లేనిచో ప్రభుత్వం ఆధ్వర్యంలో తొలగించుటయే కాక దానికి అయిన ఖర్చును సంబంధిత ఆక్రమణదారుడు చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. వై.రామవరం గ్రామ నివాసి ఎల్.శారదా దేవి లోకాయుక్త కర్నూలు వారికి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. వారి ఆదేశానుసారమే ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. 65 మంది ఆక్రమణదారులలో 14 మంది సబ్ మెజిస్ట్రేట్ రంపచోడవరం నుండి ఇంజెక్షన్ ఆర్డర్ తీసుకువచ్చారని పంచాయతీ కార్యదర్శి నోటీసులో పేర్కొన్నారు. నోటీసులో ఇచ్చిన గడువు సమీపించడంతో ఆక్రమణదారులలో గుబులు మొదలైందని స్థానికులు అంటున్నారు.



# హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని ఆర్ అండ్ బి శాఖ





ఆదమరిస్తే ప్రమాదమే

**వై రామవరం, పెన్ పవర్, అక్టోబర్ 17 :** రోడ్లు మరియు భవనాల శాఖ నిర్వహించే రహదారులలో ప్రమాదకరమైన ప్రదేశం, మలుపులలో ఏ విధమైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఆదమరిస్తే ప్రమాదం సంభవించడం ఖాయమని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డతీగల, వై. రామవరం ఆర్ అండ్ బి రహదారి పొడవునా అనేక ప్రమాదకరమైన సంఘటనలు సంభవించే ప్రదేశాలు ఉన్నాయని, చాలా చోట్ల హెచ్చరిక బోర్లు ఏర్పాటు చేయలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. కొన్ని ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులు ఉన్న తుప్పలు ( జంగిల్)లో ఉండిపోవడంతో రాత్రి సమయంలో వాహనదారులకు కనిపించడం లేదన్నారు. గత నెలలో ఏ ఆర్ రహదారి ఇరువైపులా బ్లేడ్ ట్రాక్టర్ తో జంగిల్ కటింగ్ చేయడం జరిగిందని తెలిపారు. చాలా ప్రదేశాలలో జంగిల్ రోడ్డు పైకే ఉన్నా క్లియర్ చేయలేదని అంటున్నారు. చవిటి దిబ్బలు, పనసలపాలెం గ్రామాల మధ్యలో గతంలో అనేక వాహన ప్రమాదాలు సంభవించాయని, చాలామంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రస్తుతం అదే ప్రాంతంలో వంతెన వద్ద లోతైన గొయ్యి రోడ్డు ప్రక్కనే ఉందని, ఆదమరిస్తే ప్రమాదం సంభవించే పరిస్థితులు ఉన్నాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా చవిటి దిబ్బలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దగ్గర రోడ్డుకు ఇరువైపులా జంగిల్ రోడ్డుపైకే ఉందని, ఎదురెదురుగా వాహనాలు వస్తే ప్రమాదం సంభవించే పరిస్థితులు ఉంటాయని అంటున్నారు. తూతూ మంత్రంగానే జంగిల్ కటింగ్ చేశారు తప్ప, పూర్తిస్థాయిలో జంగిల్ కటింగ్ చేయలేదని వాహనదారుల ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఆర్ అండ్ బీ శాఖ అధికారులు స్పందించి ఏఆర్ రహదారి పొడవునా , కల్వర్టుల వద్ద ఉన్న జంగిల్ ను తొలగించి, గతంలో మాదిరిగా వైట్ వాస్ వేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వాహనదారులు కోరుతున్నారు.

## అంతర్రాష్ట్ర లారీల దొంగల ముఠా అరెస్ట్..





**కోరుకొండ, రాజానగరం, పెన్ పవర్, అక్టోబర్ 17:**జాతీయ రహదారిపై లారీలు దొంగతనాలు చేస్తున్న అంతరాష్ట్ర ముఠాను రాజానగరం పోలీసులు పట్టుకున్నారు. లారీ స్వాధీనం చేసుకుని నిందితులతో సిఐ ప్రసన్న వీరయ్య గౌడ్, నార్త్ జోన్ డిఎస్పీ వై. శ్రీకాంత్ శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలిపారు. దివాన్ చెరువు జాతీయ రహదారి గామన్ బ్రిడ్జి సమీపంలో మన్యం గణేశ్వరరావుకు శ్రీ కృష్ణ ఇన్ఫ్రా లారీ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసు ఉంది. గత నెల 25వ తేదీన వివాహానికి వెలుతూ ట్రాన్స్ పోర్ట్ ఎదురుగా తన స్నేహితుడైన ఎఎన్ఆర్ కాటా లారీ యజమాని అబ్బిరెడ్డి నాగేశ్వరరావు ప్రక్కన కాలీ స్థలంలో నాలుగు లారీలు ఉంచి తాళాలు కాటా లారీ ఆఫీస్ లో ఇచ్చాడు. మరునాడు ఉదయం వచ్చి చూస్తే ఒక టిప్పర్ లారీ కనపడలేదు. దీనిపై అబ్బిరెడ్డి నాగేశ్వరరావుకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. సిసి కెమెరాలు ఆధారంగా కొవ్వూరు మండలం దొమ్మేరు సమీపంలో లారీని స్వాధీనం చేసుకున్నారు. దీనికి రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన భారత్ పూర్ జిల్లా ఖోహి తాలుకా ధహెూటా గ్రామం షాకత్ ఖాన్, అల్వార్ జిల్లా శేపూర్ గ్రామం జమాన్ ఖాన్, సోహిల్, హైదరాబాద్ లో వనస్థలపురం చెందిన మహ్మద్ ఫసిఉద్దీన్ లను నిందితులుగా గుర్తించి అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. లారీ విలువ రూ.42 లక్షలు ఉంటుందని చాకచక్యంగా నిందితులను పట్టుకున్న ఎస్ఐ ఎస్. ప్రియ కుమార్, హెడ్ కానిస్టేబుల్ అమ్మిరాజు, నరేష్ రాజు, సత్యనారాయణ,క్రీం, సురేష్, బివి రమణ అను అభినందించారు.

# బిజెపి బలోపేతానికి కలిసి కట్టుగా కృషి చేయాలి





* రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల
* రామసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం

**గోకవరం, పెన్ పవర్,అక్టోబర్ 17 :** భారతీయ జనతా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా కృషి చేయాలని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు అన్నారు. గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ లే అవుట్ ప్రాంగణంలో గురువారం కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ బలోపేతం కొరకు బీజేపీ, రామసేన, నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజానగరం, జగ్గంపేట, రంపచోడవరం మూడు నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రామసేన సభ్యులు వేలాదిగా తరలివచ్చారు. తొలుత రాజానగరం, గంగవరం, వై.రామవరం, అడ్డతీగల, గండేపల్లి, పత్తిపాడు మండలాల అధ్యక్షులు ఆళ్ల శివరామ కృష్ణ, నీలాలమ్మ, ఆదివిష్ణు, వెంకన్న బాబు, రాజబాబు, వీరబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అనేక సంక్షేమ పథకాల వల్ల ఎంతో మంది నిరుపేదలు లబ్ది పొందుతున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా ఉంటూ, పార్టీని ముందుకు తీసుకువెళ్లాలని కోరారు, రానున్న కాలంలో భారతీయ జనతా పార్టీని ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి తీసుకువచ్చే విధంగా కష్టపడి పనిచేయాలన్నారు. కంబాల శ్రీనివాసరావు రామసేన సంస్థ ద్వారా మూడు నియోజకవర్గాల్లో పేదలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఆయన చేరికతో భారతీయ జనతా పార్టీ నియోజకవర్గంలో మరింత బలం పెరిగిందన్నారు. ఆయా గ్రామాల నుంచి బీజేపీ పార్టీలోకి వలసలు పెరిగాయని తెలిపారు. అనంతరం కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీని ఆదర్శంగా తీసుకుని, ప్రజలకు మరింత సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానన్నారు. పలు గ్రామాల నుంచి పార్టీలో చేరడానికి వందల మంది సిద్ధంగా ఉన్నారనన్నారు. క్రమశిక్షణతో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, కూటమి నాయకులు కరిబండి వెంకటేశ్వరరావు, వెంకట్, వరసాల ప్రసాద్, బత్తుల నానాజీ, దాసరి ధర్మరాజు, పెద్దడా వెంకన్న దొర, పసల గణేష్, దేశాల నరేష్, పచ్చారి నరసింహారావు, పిల్ల సత్య నారాయణ, వేంకటేష్, సత్యనారాయణ, సుధా, పదిలం మురళి, ప్రగాఢ ప్రభ, అచ్చారావు, నాగ రమేష్, అంజలి, రాయపాటి సత్యనారాయణ, పద్దరాజు, కర్రి మణికంఠ, మళ్ల అధిశేషు, కంబాల త్రిమూర్తులు, చల్లరావు, వీర్రాజు, దోసపాటి సుబ్బారావు, గౌతమ్, సుజాత పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నగర పాలక సంస్థ అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం : మంత్రి కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 17:** నగర పాలక సంస్థ అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామని నూతన మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనాకు మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. ఇటీవల బదిలీపై రాజమహేంద్రవరం వచ్చిన రాహుల్ మీనా మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత శుక్రవారం నివాసంలో మంత్రి దుర్గేష్ ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నగర పాలక సంస్థలో నెలకొన్న సమస్యలకు పరిష్కార మార్గాలను, కార్పొరేషన్ అభివృద్ధి, గోదావరి పుష్కరాలపై చర్చించారు. మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ రాహుల్ మీనాకు సూచించారు.

## నేడు గొల్లపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం

**కాజులూరు, అక్టోబర్ 16 పెన్ పవర్:**గొల్లపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు ఈ నెల 18వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏపీఈపిడిసిఎల్ ఎలక్ట్రికల్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ ఎన్.ఉదయ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారుఈ అంతరాయం సబ్‌స్టేషన్ అభివృద్ధి పనుల భాగంగా జరుగుతుందని పేర్కొన్నారు.విద్యుత్ సరఫరా నిలిపివేయబడే ప్రాంతాలు:బందనపూడి, మొగలిపాలెం, శలపాక, తనుకువాడ, శీల,ఒంటితాడి,మంజేరు, టీ.మామిడాడ, గొర్రిపూడి, పెనుమల్ల, అంద్రోగి, తనుమల్ల, పెడపాటి గరువు, పెద్దాప్పుర ప్పాడు,యండమూరు, విజయ రాయుడుపాలెం, జగన్నాథగిరి గ్రామాలు.ఈ పరిధిలో గృహ వినియోగ దారులు, ఆక్వా మరియు పారిశ్రామిక యూనిట్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అందరూ ఈ అంతరాయం పట్ల సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. ఉదయ భాస్కర్ విజ్ఞప్తి చేశారు.

## కోరుకొండ గ్రామంలో సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ.

* ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి..



**కోరుకొండ, పెన్ పవర్, అక్టోబర్ 17:** కోరుకొండ మండలం కోరుకొండ గ్రామానికి చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సిఫార్సుతో మంజూరు అయిన చెక్కులను వారి ఇంటికి వెళ్లి వారికి అందజేసిన జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో–ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పంపిణీ చేశారు.గ్రామానికి చెందిన గ్రంధి ప్రసాద్ కి మంజూరు అయిన 30,000 చెక్కును మరియు గంగుల చింతాలకి మంజూరు అయిన 40,447 చెక్కు ను ఇదే గ్రామానికి చెందిన కొటికలపూడి సీతారామలక్ష్మికి మంజూరు అయిన 50,000 చెక్కును వారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గౌరవ అధ్యక్షులు బదిరెడ్డి దొర, అడ్డాల శ్రీనివాస్, శివరామకృష్ణ, శంకర శ్రీను,తగరంపూడి గణపతి కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి విశేష స్పందన



**కాకినాడరూరల్,అక్టోబర్ 17 పెన్ పవర్:**
ప్రజా సమస్యల పరిష్కారానికి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమంకు ప్రజలు విశేషంగా స్పందిస్తున్నారు.శుక్రవారం సామర్లకోట మండలం కొప్పవరం గ్రామంలోని కార్యాలయంలో జరిగిన 26వ ప్రజా దర్బార్‌కు అర్జిదారులు భారీగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రజలు ఉద్యోగ–ఉపాధి అవకాశాలు, ఇల్లు స్థలాలు, డ్రైనేజీ నిర్మాణం, సీఎం రిలీఫ్ ఫండ్, వైద్య సహాయం, బియ్యం కార్డుల మంజూరు,పేర్లమార్పులు%–%చేర్పులు, పింఛన్లు వంటి సమస్యలపై29 వినతులు సమర్పించారు.వాటిలో కొన్నింటిని వెంటనే పరిష్కరించగా, మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు పంపి త్వరితగతిన చర్యలు ప్రారంభించామని కార్యాలయ ఇన్‌చార్జ్ మేకా లక్ష్మణ్ మూర్తి తెలిపారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా వినిపించి వెంటనే పరిష్కారం పొందు తున్నారని, ముఖ్యంగా నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాల కోసం పెద్ద సంఖ్యలో అర్జీలు సమర్పిస్తు న్నారని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వ రరావు, ఆనంద్ న్యూటన్, చింతపల్లి అర్జున్, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ చెప్పుడి వెంకటేశ్వరరావు, డిఆర్ యు సి సి సభ్యుడు ముత్యాల అనిల్, జున్నూరు బాబ్జి, సిరియాల కొండబాబు, ఐటీడీపీ పాలికా సతీష్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దీపావళి నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్



**రంపచోడవరం, పెన్ పవర్ ,అక్టోబర్ 17:**
దీపావళి పండుగ నేపథ్యంలో అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్ ఆదేశించారు.రాబోయే దీపావళి పండుగ సందర్భంలో ప్రజల భద్రత, అగ్ని ప్రమాదాల నివారణ, పండుగ సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.
రంపచోడవరం మరియు చింతూరు డివిజన్లకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎస్.ఐలు, ఫైర్ ఆఫీసర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పండుగ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలు, అధికారుల బాధ్యతలపై సబ్ కలెక్టర్ కట్టుదిట్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 20వ తారీకున సోమవారం జరగనున్న దీపావళి పండుగకు దీపావళి సామాన్లు అమ్మే యజమానులు ఆయా మండలాల్లోని తాసిల్దార్లు అనుమతులు కొరకు దరఖాస్తులు సమర్పించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చింతూరు, రంపచోడవరం డివిజన్లో అనుమతులు లేకుండా దీపావళి సామాన్లు అమ్మిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు . రంపచోడవరం డివిజన్లోని ఏడు మండలాల్లో, చింతూరు డివిజన్లోని నాలుగు మండలాల్లో దీపావళి అమ్మకపు దుకాణాదారులు తప్పకుండా అధికారులు జారీ చేసిన నియమ నిబంధనలు పాటించాలని, దీపావళి అమ్మకపు దుకాణాల్ని పాఠశాలలు, ఆసుపత్రులు మరియు పెట్రోల్ బంకులకు దూరంగా తాసిల్దార్లు నిర్దేశించిన బహిరంగ ప్రదేశాలలో మాత్రమే విక్రయించాలి, దుకాణాలకు మధ్య కనీసం 5 మీటర్ల దూరం పాటించాలని, ఇసుక బుక్కెట్స్, ఫైర్ వాటర్ డ్రమ్ములు అందుబాటులో ఉంచుకోవాలని అని అన్నారు. వాహనాలు పార్కింగ్ కు బోర్డులు పెట్టలాని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం దీపావళి సామాన్లు అమ్మే యజమానులు ఆయా మండలాలలోని తాసిల్దార్లకు దరఖాస్తులు సమర్పించాలని అదేవిధంగా సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి దీపావళి సామాన్లు అమ్ముకునే విధంగా అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. దీపావళి పండుగ అయ్యేంతవరకు అగ్నిమాపక అధికారులు సిబ్బంది, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. దీపావళి సామాన్లు అమ్మే ప్రాంతాలలో ముఖ్యంగా సాధ్యమైనంతవరకు అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు.

## ఉద్యోగుల పీజీఆర్ఎస్ కు 13 అర్జీలు..



**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 17:**రాష్ట్ర ప్రభుత్వం సూచనల ప్రకారం శుక్రవారం సాయంత్రం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం జరుగింది.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎన్వీవీ.సత్యనారాయణ.. ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమం వివిధ సమస్యలపై 13 అర్జీలు అందాయని ఆయన తెలిపారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఉద్యోగుల సమస్యల పరిష్కార నిమిత్తం ప్రతినెల 3వ శనివారం ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్విని చేసుకోవాలని ఆయన తెలిపారు.

## జస్టిస్ గవాయ్ పై దాడిని ఖండించిన మాదిగ సంఘాలు



**గోకవరం, పెన్ పవర్, అక్టోబరు 17 :** పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు మండల ఎంఎస్పి అధ్యక్షులు గరబారపు శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చాపల సూరిబాబు మాదిగ ఆధ్వర్యంలో
భారతదేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ పై జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అనుబంధ సంఘాల నాయకులు కలిసి స్థానిక తహసీల్దార్ రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు.దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని స్వతంత్రం వచ్చి 78 సంవత్సరాలు కావస్తున్నా తరాలు మారినా తలరాతలు మారటం లేదని ప్రభుత్వాలు మారినా దళితుల మీద దాడులు జరుగుతూనే ఉన్నాయని ఇటువంటి దాడులు మళ్లీ పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలని రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థ గౌరవాన్ని, కాపాడాలని ప్రజాస్వామ్యంపై నమ్మకం కలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి సీనియర్ నాయకులు మండల ఉపాధ్యక్షులు ములపర్తి నాగేశ్వరరావు మాదిగ బొడ్డపాటి వీర చంద్ర మాదిగ మద్దాల శ్రీను మాదిగ జగ్గారపు చిరంజీవి మాదిగ కుందేటి గంగాధర్ మాదిగ రామవరపు రాజేష్ మాదిగ పులిగుర్తి రాములు మాదిగ అరసాల జాన్ ప్రసాద్ మాదిగ అరసాల మోహన్ మాదిగ బాతు ఆనంద్ మాదిగ బొద్దాని బొద్దాని బాపిరాజు మాదిగ అరసాల శ్రీను మాదిగ చీకట్ల నాని మాదిగ బొడ్డపాటి చిన్ని మాదిగ కాపారపు రాజు మాదిగ కోరుమిల్లి కాంతరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఈజీఎస్ అమలులో సమర్థతకు దిశానిర్దేశం

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వర్క్‌షాప్ నిర్వహించిన పథక సంచాలకులు అడపా వెంకటలక్ష్మి





**కాకినాడ, అక్టోబర్ 16 పెన్ పవర్:**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలన్న సంకల్పంతో కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు గురువారం కలెక్టరేట్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టరేట్ వివేకానంద హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పథక సంచాలకులు అడపా వెంకటలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ అక్టోబర్ 2 నుండి ప్రారంభమైన 2026%–%27 వార్షిక ప్రణాళిక కింద చేపట్టాల్సిన పనుల గుర్తింపు, పథకంలోని ప్రధాన అంశాలు, కొత్త మార్పులు, శ్రామికుల ఈ కే వైసీపీ నమోదు, మెటీరియల్ పనుల టెండర్ ప్రక్రియలు తదితర అంశాలపై సమగ్ర చర్చ జరిగింది అని తెలిపారు.పథకం అమలులో పారదర్శకత, సమయపాలన, సాంకేతిక వినియోగం ద్వారా పనుల నాణ్యతను పెంపొందించా లని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ (ఎస్ఈపీఆర్,) ఏపీవో , విజయభాస్కర్ (ఎఫ్ ఎం) తో పాటు కాకినాడ, ప్రత్తిపాడు, కత్తిపూడి క్లస్టర్ ఏపీడీ లు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండించిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్**

**కాజులూరు, అక్టోబర్ 16 పెన్ పవర్:**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయి గారిపై జరిగిన పాశవిక దాడిని ఖండిస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో గురువారం కాజులూరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ కె. సామ్రాట్ మధు సూచనలతో, కాజులూరు మండలంలో ఎంఆర్‌ఓ కార్యాల యం వద్ద నిరసన ర్యాలీ నిర్వహించి,ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు పలివెల ఇజ్రాయిల్ రాజు మాట్లాడుతూ, "సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం రాజ్యాంగంపై దాడితో సమానం. దోషులను వెంటనే చట్టపరంగా శిక్షించాలి" అని అన్నారు.మండల అధ్యక్షుడు ఖండవెల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, "ఈ దాడి దళితులపై, ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగినదే. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.రామచంద్రపురం ఇన్‌చార్జ్ సిర్రా సురేష్ హెచ్చరిస్తూ, "దోషులను వెంటనే శిక్షించకపోతే దేశవ్యాప్తంగా దళితులు ఐక్యంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతారు" అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పలివెల రాజు, కొమ్ము కృష్ణమూర్తి, ఇందుర్తి బుజ్జి, జొన్నకూటి వెంకటరమణ, లాజరు, రాయి రవి,తాతపూడి ఇజ్రాయిల్, పలివెల సత్యనారాయణ, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీం కోర్టు న్యాయమూర్తి పై. దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి.



● ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన.

**మండపేట. పెన్ పవర్. అక్టోబర్ 17 :**భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై ఈ నెల అక్టోబర్ 6న దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని ఎమ్మెస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధూళి జయరాజు మాదిగ , ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నేదునూరి రాజేష్ మాదిగ డిమాండ్ చేశారు.
దీని వెనుక ఉన్న శక్తులను గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు మండపేట తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ తేజేశ్వరరావు కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షులు గోసాల వినయ్ , వి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు షేక్ నబీ,బొమ్ము గంగాధర్ ,గాలింకి చరణ్ ,అయినవిల్లి రమణ,కొల్లి చిన్నారావు,చాపల సత్తెన్న,తాతపూడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


# బాణాసంచా ప్రేలుడు ఘటన ఉన్నత స్థాయి దర్యాప్తు కమిటీ ముందు నిరసన.



**మండపేట. పెన్ పవర్. అక్టోబర్ 17 :**పేలుడుబాధిత కుటుంబాలతో కలిసి పీ.డీ.ఎస్.యూ , ఏ.ఐ.కె.ఎం.ఎస్, ఐ.ఎఫ్.టీ.యూ, ఎం. ఆర్. పి.ఎస్. రిపబ్లిక్ పార్టీ ఇండియా ప్రజా సంఘాల నిరసన ధర్నా నిర్వహించారు.
రాయవరం మండలం కొమరిపాలెం శివారు వి సావరం గ్రామంలో జరిగిన శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ ఘోర ప్రేలుడు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతస్థాయి దర్యాప్తు కమిటీ ముందు బాధిత కుటుంబాలు ప్రజా సంఘాలు వినతిపత్రం సమర్పించాయి.
ఈ సందర్భంగా పీ.డీ.ఎస్.యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఎం.ఆర్.పీ.ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు దూళి జయరాజ్ మాదిగ, ఏ.ఐ.కెఎం.ఎస్ జిల్లా నాయకులు వెంటపల్లి భీమ శంకరం, రిపబ్లిక్ పార్టీ ఇండియా నాయకులు కోన లాజర్ తదితరులు మాట్లాడుతూ ఈ దుర్ఘటనలో మృతి చెందిన వారు అందరూ పేద శ్రమజీవులు, ఎస్.సి. బి.సి. వర్గాలకు చెందిన కార్మికులన్నారు. ఒక్కసారిగా తమ కుటుంబాలకు ఆధారమైన పెద్ద దిక్కును కోల్పోయారన్నారు. చనిపోయిన 9 మంది పై పిల్లలు, కుటుంబం ఆధారపడి ఉంటుందన్నారు. ఈ కుటుంబాలు ఇప్పుడు ఆర్థికంగా, మానసికంగా చితికిపోయి ఉన్నాయన్నారు. ప్రభుత్వం మానవత్వంతో స్పందించాలని విజ్ఞప్తి చేశారు.
దర్యాప్తు కమిటీ ఛైర్మన్ ఎన్. సురేష్‌కుమార్ కి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యూ చింతా రాజా రెడ్డి, పీ.వై.ఎల్ నాయకులు వానపల్లి నాగరాజు, రాయవరం సర్పంచ్ చంద్రమళ్ళ రామకృష్ణ , లంక రాజేష్, లంక పుత్రయ్య బాధిత కుటుంబాల సభ్యులు పాకా ప్రభాస్,వి. రాంబాబు, చిట్టూరి శ్రీను, కాళా అర్జున్, లింగం చంద్ర శేఖర్, పాల్గొన్నారు.

# న్యూఢిల్లీలో జరిగిన ఆది కర్మయోగి సెమినార్ కార్యక్రమంలో ఎంపీడీవో





**వై రామవరం, పెన్ పవర్, అక్టోబర్ 17:** న్యూఢిల్లీలో జరిగిన ఆది కర్మయోగి సెమినార్ కార్యక్రమంలో వై. రామవరం ఎంపీడీవో కే.బాపన్న దొర పాల్గొన్నారు.
మారుమూల గిరిజన ప్రాంతాలలో విద్యా, వైద్యం, రహదారి సౌకర్యం, మంచినీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పన ధ్యేయంగా ఆది కర్మయోగి సెమినార్ నిర్వహించడం జరిగిందని తెలిపారు.న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన ఆది కర్మయోగి సెమినార్ కార్యక్రమంలో రంపచోడవరం ఐటీడీఏ నుండి బ్లాక్ మాస్టర్ ట్రైనర్ గా హాజరు అవడం జరిగిందని ఎంపీడీవో కే.బాపన్న దొర తెలిపారు. అదేవిధంగా ఆది సేతుగా గొల్లపల్లి సత్తిబాబు, బాడదనాంపల్లి రాజవొమ్మంగి మండలం నుండి, ఆది సహా యోగిగా హేమలత వివో లీడర్ ఐ.పోలవరం రంపచోడవరం మండలం నుండి హాజరవడం జరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుండి ప్రిన్సిపల్ సెక్రెటరీ విజయలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఏ ఎస్ ఆర్ జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ కూడా హాజరుకావడం జరిగిందని తెలిపారు.

# కాజులూరులో డిప్యూటీ ఎంపీడీవోగా ముమ్మిడి చక్రపాణి బాధ్యతల స్వీకారం



● పంచాయతీ కార్యదర్శుల ఘన స్వాగతం

**కాజులూరు, అక్టోబర్ 17 పెన్ పవర్:** కాజులూరు మండలంలో కొత్త డిప్యూటీ ఎంపీడీవోగా ముమ్మిడి చక్రపాణి శుక్రవారం మధ్యాహ్నం పదవీ బాధ్యతలు స్వీకరించారు.పంచాయతీ కార్యదర్శి గ్రేడ్%-×%గా, అలాగే ఈటీసీ సామర్లకోట నందు ట్రైనర్‌గా విశేష సేవలు అందించిన చక్రపాణి , పదోన్నతి పై కాజులూరు మండలానికి బదిలీ అయ్యారు.బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు ఆయనకు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శులు కె.ఈశ్వరి, కె.రవిప్రసాద్,కె.అనంతలక్ష్మి, సీహెచ్.సూర్యప్రకాష్,ఎం. శ్రీనివాస్, కె. సూరిబాబు,శివకుమార్ ,పి. రవి, భాగ్య, శృతి, కుమారి,ఇషాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ

**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 17:** జగ్గంపేట మండలంలో గుర్రంపాలెం గ్రామ పంచాయతీలోని బలభద్రపురం గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి, జీడీ మామిడి, కూరగాయల సాగులో యాజమాన్య పద్ధతులపై మండల ఉద్యాన అధికారిని ఎ.శ్రీ వల్లి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రిషి విజ్ఞాన కేంద్రం కలవచర్ల శాస్త్రవేత ఎన్.వి. రఘునందన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీడీ మామిడి, మామిడిలో సమగ్ర ఎరువుల యాజమాన్యం, కత్తిరింపులు, సమగ్ర సస్యరక్షణ వంటి చర్యలు చెప్పట్టినట్లయితే నాణ్యమైన పంట దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ముఖ్యంగా జీడిమామిడిలో ఎరువుల యాజమాన్యం గురించి మాట్లాడుతూ పశువుల ఎరువు 50 కేజీలు, యూరియా 1.1 కేజీ,సూపర్ 800 గ్రాములు,పోటాష్ 600 గ్రాములు మొక్కకి అక్టోబర్ నుండి నవంబర్ మధ్యలో వేసుకోవాలని సూచించారు. వీటితో పాటు సూక్ష్మ పోషకాలైన ఐరన్ 250 గ్రాములు ఒక ఎకరానికి చిగురుపూత వచ్చే దశల్లో రెండు దఫాలుగా వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరోతి కృష్ణ, ఎర్ర పరమేశ్వరరావు, కట్టమూరి రామకృష్ణ, రైతులు, ఉద్యాన సహాయకులు, పామ్ ఆయిల్ సిబ్బంది పాల్గొన్నారు.



# తణుకు ప్రభుత్వాసుపత్రి పరిశుద్ధ కార్మికుల సమ్మె

31 నెలల పీఎఫ్ చెల్లింపులు, బకాయిల వేతనాలపై ఆందోళన



**తణుకు, పెన్ పవర్ అక్టోబర్ 17 :**తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 21వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నారు. 31 నెలలుగా ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సొమ్ములు జమ చేయకపోవడంతో పాటు నాలుగు నెలల వేతనాలు బకాయిగా ఉన్నాయంటూ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఈ మేరకు ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. సాయికిరణ్, ఆర్ఎంఓ డాక్టర్ తాతారావులకు సమ్మె నోటీసు సమర్పించారు.
యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోణాల భీమవరం రావు మాట్లాడుతూ, "హాస్పిటల్ స్థాయి 150 పడకల దైనా, పరిశుద్ధ కార్మికుల సంఖ్య 50 మందికి కూడా తక్కువగా ఉంది. వేతనాలు ఆలస్యంగా ఇవ్వడమే కాకుండా, పీఎఫ్ మొత్తాలు కూడా కార్మికుల ఖాతాలకు జమ కావడం లేదు. కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో వస్తువులు తెచ్చుకుని విధులు నిర్వహిస్తున్నారు" అని తెలిపారు.
తక్షణమే బకాయిల వేతనాలు చెల్లించి, పీఎఫ్ సొమ్ము జమ చేయాలని, కార్మికులపై ఉన్న పని భారాన్ని తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ధర్మాన్ని, పుష్పలత, భారతి, సిహెచ్. మంగమ్మ, విజయలక్ష్మి, బండి శ్రీను, వెంకట్, లక్ష్మీ ప్రసన్న, అంబేవి, హైమావతి, డి. శ్రీనివాసు, చింతల తదితరులు పాల్గొన్నారు.

# జనసేనలోకి భారీగా చేరికలు రమణపాలెంలో





**చింతూరు పెన్ పవర్ అక్టోబర్ 15:**చింతూరు మండలం రమణపాలెం గ్రామపంచాయతీ పరిధిలో, జనసేన పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ తీగల రవి ఆధ్వర్యంలో గ్రామంలో పార్టీ సమావేశం జరిగింది. 20 కుటుంబాలు జనసేనలో చేరడంతో గ్రామంలో రాజకీయంగా ఉత్సాహ వాతావరణం నెలకొంది.
ఈ సందర్భంగా గ్రామ పటేల్ సోడే తమ్మయ్య మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు మాకు నచ్చాయి. ప్రజా సేవలో ఆయన చూపుతున్న తపన మమ్మల్ని ఆకట్టుకుంది. అందుకే మేమంతా జనసేన పార్టీలో కి చేరాలని నిర్ణయించుకున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో సోడే తమ్మయ్య, దుమ్మిరి ముఖేష్, సోడే అప్పారావు, సోడే వీరయ్య గ్రామస్థులు తదితరులు తమ కుటుంబాలతో కలిసి జనసేనలో చేరారు.
ఈ కార్యక్రమంలో జనసేన మండల కమిటీ సభ్యులు మడివి రాజు, పయ్యాల నాగేశ్వరరావు, కన్నారావు, బేడే సతీష్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

# పేకాడుతున్న ఆరుగురు అరెస్టు



**గోకవరం, పెన్ పవర్, అక్టోబరు 17 :** ముందస్తు సమాచారం మేరకు స్థానిక ఎస్సై వివిఎన్వి పవన్ కుమార్ ఆదేశాలతో ట్రైనీ ఎస్సై పి నాగమణి ఇతర సిబ్బందితో శుక్రవారం కొత్తపల్లిలోని పేకాటశిబిరంపై దాడిచేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారివద్ద నుండి 17 వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు.మండలంలో అసాంఘిక కార్యకలాపాల సమాచారం నేరుగా ఎస్సై వాట్సాప్ నెంబరు 9440904830 కు సమాచారం అందజేయాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

# న్యాయమూర్తి పై దాడి చేసిన వారిని చట్టపరమైన చర్యలు తీసుకోవాలి...



**కూనవరం,పెన్ పవర్,అక్టోబర్ 17.**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయి పై జరిగిన దాడిని ఖండిస్తూ మందా కృష్ణ మాదిగ పిలుపుమేరకు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు,కార్యకర్తలు పాత బస్టాండ్ సెంటర్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి గడ్డం వెంకటేశ్వర రావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడి చేసిన వారిని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా చూడాలని అన్నారు.అనంతరం తాసిల్దార్ కే శ్రీనివాస కు వినతి పత్రాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో మారపాక శ్రీను,మోదుగు వెంకన్నబాబు,బింగి విష్ణు,గడ్డం బాబురావు,ముమ్మేటి దుర్గారావు,గడ్డం సుధాకర్,గద్దల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్న దర్శనంతో గంటి హరీష్ మధుర్ భక్తి పరవశం





**ఆత్రేయపురం, పెన్ పవర్, అక్టోబర్ 17:**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు శుక్రవారం అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మధుర్ స్వామివారిని దర్శించుకున్నారు.

ఆ ఏడు వారాల వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న సందర్భంగా ఆలయ అధికారులు ఎంపీ హరీష్ మధుర్ మహామర్యాదలతో స్వాగతించి, ఆలయ రీతిన పూర్వకంగా పట్టు వస్త్రాలతో సత్కరించారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య ఎంపీ వేదాశీర్వచనం అందజేసి తీర్థప్రసాదాలు సమర్పించారు.
ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు స్వామివారి పవిత్ర చిత్రపటాన్ని స్మారకంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆత్రేయపురం మండల టిడిపి అధ్యక్షుడు కూసం పూడి రామకృష్ణ రాజు (బాబు), నాయకులు సాయి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.
భక్తి భావనతో నిండిన ఈ సందర్భంగా ఎంపీ హరీష్ మధుర్ మాట్లాడుతూ ః
“వాడపల్లి వెంకన్న ఆశీస్సులతో కోనసీమకు శాంతి, సంపదలు కురవాలని ఆకాంక్షిస్తున్నాను,” అని తెలిపారు.

# జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ అవగాహన కార్యక్రమం



**వై రామవరం, పెన్ పవర్, అక్టోబర్ 17**: మండలంలో నువ్వు గంటి పాలెం లో జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ( పూర్వపు కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ) రాజమండ్రి వారిచే గిరిజన ఉప ప్రణాళిక ప్రాంతంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు.

సమతుల్య పోషకాహారం ఆవశ్యకత గురించి డాక్టర్ కే సుమన్ కళ్యాణి ఐసిఎఆర్ శాస్త్రవేత్త తగు సూచనలు ఇచ్చి,అవగాహన కల్పించారు. గ్రామ ఆదివాసీ మహిళలకు 1500 రూపాయల విలువచేసే పోషకాహారం కిట్లు 50 పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. వై రామవరం ఎంపీడీవో కే బాపన్న దొర, ఆస్పిరేషన్ బ్లాక్ ఆఫీసర్ లవన్ కుమార్, సూచనల మేరకు నువ్వు గంటిపాలెంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పూర్ణ బిందు, డాక్టర్ హేమ, డాక్టర్ కృష్ణకుమారి సూచనలు సలహాలను గిరిజన మహిళలకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి రాహుల్ సత్యానంద రెడ్డి సచివాలయం సిబ్బంది,డ్వాక్రా మహిళలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో మూడు నెలల జైలు శిక్ష..

**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ 17:** సీతానగరం పోలీస్ స్టేషన్లో నమోదైన దొంగతనం కేసులో ఇద్దరికీ మూడు నెలలు జైలు శిక్ష క్రైమ్ నంబర్ 478/2021 యు/ఎస్ ఐపిసి సెక్షన్ 457,380 నమోదు చేసి దర్యాప్తు చేసి సాక్షాదారాలను కోర్టులో సకాలంలో ప్రవేశపెట్టడం ద్వారా నిందితులు బండి ధర్మరాజు మరియు సికిలే సూర్యచంద్ర సురేంద్ర దోషులుగా సెవెంత్ అదనపు ప్రథమ శ్రేణి మేజిస్ట్రేట్ కోర్టు (సెవెంత్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్) విచారణ అనంతరం జడ్జి పి. బాబు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 248(1) ప్రకారం ఇద్దరికీ మూడు నెలల జైలుశిక్ష మరియు రూ. 5,000 జరిమానా విధించడం జరిగింది. విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఓలేటి మహాలక్ష్మి మరియు సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టడానికి కోర్టు కానిస్టేబుల్ షరీఫ్ కీలకపాత్ర పోషించారు అని సీతానగరం సబ్ ఇన్స్పెక్టర్ డి రామ్ కుమార్ తెలపడం జరిగింది.



# 15 నెలల పాలన లో నగరంలో రూ. 278 కోట్ల అభివృద్ధి పనులు

- మున్సిపల్ కార్పొరేషన్ కి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు
- సీఎం రిలీఫ్ ఫండ్ కింద 235మందికి
- రూ. 2.66 కోట్లు పంపిణీ
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్,17:** కూటమి ప్రభుత్వం వచ్చాక గత 15 నెలల్లో నగరంలో రూ. 278కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. ఇంతవరకు రూ .158కోట్ల రూపాయల అభివృద్ధి పనులు పూర్తిచేశామని, 2025-26లో రూ .120కోట్ల రూపాయలతో పనులు చేపట్టామని రూ. 30 కోట్ల పనులు జరుగుతూన్నాయని ఎమ్మెల్యే వాసు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం లో అభివృద్ధి, సంక్షేమం జరుగుతున్నాయని శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ లో జాతీయ స్థాయిలో 19వ స్థానం, రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం లభించిందన్నారు. స్థానిక హోటల్ జగదీశ్వరిలో శుక్రవారం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ, నగరానికి జలశక్తి అవార్డుతో పాటు రూ. 2 కోట్లు బహుమతి కార్పొరేషన్ కి లభించిందని అన్నారు. ఎన్ కాప్ కింద వై సిపి హయాంలో నిర్లక్ష్యం వల్ల కోటి రూపాయలు మాత్రమేరాగా , కూటమి వచ్చాక రూ .11కోట్లు మంజూర చేయించగలిగామన్నారు. రూ.6.38కోట్ల సిఎస్సార్ నిధులు వెచ్చిస్తున్నామన్నారు. పేపరు మిల్లు కార్మికులకు యాజమాన్యంతో అగ్రిమెంట్ చేయించి, కార్మికులకు న్యాయంచేసా మన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద 235 మందికి రూ 2,66 కోట్లు ఇచ్చామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. వైసిపి హయాంలో ఒక్కరికి కూడా సీఎం రిలీఫ్ ఫండ్ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. నగరంలో 14 దేవాదాయ ధర్మాదాయ కమిటీలకు గాను 8 పూర్తిచేశా మని, త్వరలో మిగిలిన నాలుగు కమిటీలు వేస్తామని చెప్పారు. నగరంలో నేరాల సంఖ్య తగ్గించామని, గడిచిన ఐదేళ్లలో కేవలం 114రౌడీషీట్లు తెరిస్తే, కూటమి ప్రభుత్వం వచ్చిన 15 నెలల్లో 96 రౌడీ షీట్స్ తెరిసామని ఆదిరెడ్డి చెప్పారు. యాచకుల సర్వే చేయించి వారిలో 20 మంది నేరస్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, 96 మందిని వారి వారి గ్రామాలకు పంపించి వేసామన్నారు. తెలుగుదే శం,జనసేన, బిజెపి పార్టీల నాయకులు ఐక్యతతో నగర అభి వృద్ధిలో పాలుపంచుకుంటున్నారన్నారు. ఈ మీడి యా సమావేశంలో ఏపీ శెట్టిబలిజ కార్పొ రేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ నాయకులు కాశీ నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, దొండపాటి సత్యం బాబు, ఉప్పులూరి జానకి రామయ్య, బుడ్డిగ రాధా, బుడ్డిగ రవి, కంటిపూడి శ్రీనివాస్, శెట్టి జగదీష్, కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ, తంగెళ్ళ బాబీ, కరగని వేణు, మహ్మద్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

# కిర్లంపూడి ఘనంగా కిర్లంపూడి ఎంపీపీ తోట రవి పుట్టినరోజు వేడుకలు.







**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్ 17:**కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, వీరవరం ఎంపిపి స్వగృహం లోను ఎంపీపీ తోట రవి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఎంపీడీఓ బావిశెట్టి హరికృష్ణ ఆదేశాలతో ఏఓ ప్రసాద్,జూనియర్ అసిస్టెంట్ యు ఆర్ బి ఆచార్యులు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది కేక్ కట్ చేయించి తోట రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.వెలుగు ఏపిఎం వేదకుమారి ఆధ్వర్యంలో సిసిలు,యానిమినేటర్లు,ఎంఈఓ టి జోసెఫ్ ఆధ్వర్యంలో విద్యా శాఖ సిబ్బంది,కిర్లంపూడి సొసైటీ చైర్మన్ కుర్ల చినబాబు,సీఈవో పంపన వెంకటరమణల ఆధ్వర్యంలో,ఉపాధి హామి సిబ్బంది,ఆధ్వర్యంలో ఉపాధి సిబ్బంది మండలంలో ఉన్న పంచాయతీ కార్యదర్శులతో పాటు వివిధ శాఖల అధికారులతోపాటు మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు తోట రవిచే కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు,వీరవరం సొసైటీ అధ్యక్షుడు తోట గాంధీ, వీరంరెడ్డి కాశీబాబు, భూపాలపట్నం ప్రసాద్, అనుకుల శ్రీకాంత్, జ్యోతుల రాంబాబు,సర్పంచులు గుడాల శ్రీలతారాంబాబు,పట్టు చంటిబాబు,కంటా శ్రీను,నాయకులు తూము కుమార్,కాళ్ళ వెంకటేష్,అల్లు శివరామకృష్ణ,నంది బాలకృష్ణ,ఆళ్ల నానాజీ,ఆళ్ల శ్రీమన్నారాయణ,ఆళ్ల బాబులు, మళ్ల నాగబాబు,దాడి పెదబుజ్జి,మద్దాల రాంబాబు,బొడ్డేటి గణపతి,గోడే బాల,గరగ గోవింద్,మండలంలోని పార్టీలకతీతంగా నాయకులు,రవి అభిమానులు,వివిధ శాఖల సిబ్బంది ఎంపీపీ తోట రవిని కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## వైద్యాధికారులకు మద్దతుగా నల్ల బ్యాడ్జీలతో సిబ్బంది విధులకు



**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ 17:** పిహెచ్‌సి వైద్యాధికారులు సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా చేస్తున్న నేపథ్యంలో సీతానగరం మండలంలోని పిహెచ్‌సి వైద్య అధికారులు ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధుల్లో సంఘీభావం తెలుపుతూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా వైద్యాధికారుల హక్కుల కోసం ధర్నా చేపడుతున్న నేపథ్యంలో వారు హక్కులు సాధనలో తాము కూడా భాగస్వామి కావాలనే ఉద్దేశంతో నల్ల బ్యాడ్జీలు ధరించి మద్దతు తెలుపుతూ విధుల్లో పాల్గొన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ వైయస్ రాయుడు, పి హెచ్ ఎన్ కే. ఆదిలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ బాబ్జి, ఎమ్ ఎల్ హెచ్ పిలు ఏఎన్ఎంలు హెల్త్ అసిస్టెంట్ ఆసుపత్రి ఓపీ సిబ్బంది పాల్గొన్నారు.

# మద్యం వ్యాపారంలో అక్రమాలు ప్రోత్సహిస్తున్న నగర టీడీపీ అధ్యక్షుడు మజ్జి రాంబాబు పై చర్య తీసుకోవాలి

జిల్లా ఎస్పీ కార్యాలయంలో మాజీ ఎంపీ భరత్ పిర్యాదు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,అక్టోబరు 17:** నగరంలో మద్యం వ్యాపారంలో టిడిపి నాయకులు భాగస్వాములుగా ఉండి అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను ఆర్థికంగా దోచుకుంటున్నారని వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ ఆరోపించారు. ఈమేరకు శుక్రవారం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద భైఠాయించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్ బిఎం మురళీకృష్ణకు రాజమండ్రిలో మద్యం వ్యాపారంలో టిడిపి నాయకులు చేస్తున్న అక్రమాలపై ఫిర్యాదు చేసారు. అనంతరం భరత్ మీడియాతో మాట్లాడుతూ, రాజమండ్రిలో టిడిపి నాయకుల భాగస్వామ్యంతో మద్యం అమ్మకాల్లో అక్రమాలు జరుగుతున్నాయని అయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో తెర వెనక టిడిపి ఎమ్మెల్యే పాత్ర ఉందని, ఆ పార్టీ అధిష్టానం అతన్ని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసారు. మద్యం దుకాణదారులతో ఫోన్లో మాట్లాడిన నగర టిడిపి అధ్యక్షుడు మజ్జి రాంబాబు పై తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. చేసే అక్రమాలకు బైలా రాసుకోవాలని నిర్ణయించుకోవడం దారుణమన్నారు. కల్తీ మద్యం తాగి జిఎస్ఎల్ ఆసుపత్రిలో ముగ్గురు యువకులు మృతి చెందారని, రాజమండ్రిలో చలామణి అవుతున్న కల్తీ మద్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని భరత్ డిమాండ్ చేసారు. ఎక్సైజ్ అధికారులకు ఎన్ని కేసులు ఇవ్వాలో కూడా టిడిపి నేతల ఆధ్వర్యంలో సిండికేట్ నిర్ణయం చేస్తోందని ఆయన అన్నారు. ఎక్సైజ్ అధికారులు ప్రమేయంపై విచారణ చేయాలని భరత్ డిమాండ్ చేసారు

# సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై దాడి దేశ ప్రజాస్వామ్యంపై దాడి

దోషి రాకేష్ కిషోర్‌ను అరెస్టు చేయాలని ఎంఎస్పి నేతల డిమాండ్




**పెనుమంట్ర, పెన్ పవర్, అక్టోబర్ 17:**సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం పోడూరు మండల ఎమ్మార్పీఎస్ నేతృత్వంలో మండలం కవిటం ప్రధాన కూడలిలో ఎంఆర్పిఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. కవిటం కూడలిలో నినాదాలు చేస్తూ ర్యాలీగా బయలుదేరిన నాయకులు తహసిల్దార్ కార్యాలయానికి చేరుకుని రెవిన్యూ ఇన్స్పెక్టర్ కందుల రాంబాబుకు వినతిపత్రం అందజేశారు.
వారు దాడి చేసిన రాకేష్ కిషోర్‌ను వెంటనే అరెస్టు చేయాలని, దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఎం ఎస్ పి గౌరవ అధ్యక్షులు కనపాల పెద్దిరాజు మాదిగ మాట్లాడుతూ
సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి చేయడం అనాగరిక చర్య. ఇది కేవలం ఒక వ్యక్తిపై కాదు, భారత రాజ్యాంగంపై, ప్రజాస్వామ్య వ్యవస్థపైనే దాడి. దేశంలోని ప్రతి పౌరుడు దీన్ని తీవ్రంగా ఖండించాలని అన్నారు. దళితుడైన గవాయ్ చీఫ్ జస్టిస్ కావడాన్ని కొన్ని ఆధిపత్య వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. అందుకే అహంకారంతో ఇలాంటి దాడికి తెగబడ్డాయి. ఇది దేశ దళిత, పీడిత వర్గాల మనోభావాలపై దెబ్బ. స్వతంత్ర దర్యాప్తుతో నిజాలను వెలికితీసి దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారిపై కూడా చర్యలు తీసుకోవాలని అన్నారు. సీనియర్ జడ్జిలతో కూడిన స్వతంత్ర దర్యాప్తు కమిటీని సుప్రీం కోర్టు ఏర్పాటు చేయాలి అని ఆయన కోరారు.
భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకులు చదలవాడ మనోహర్ మాదిగ, పోడూరు మండల ఎమ్మెస్పి అధ్యక్షులు ఆకుమర్తి పెద్దిరాజు మాదిగ, ఎమ్మెస్ఎఫ్ అధ్యక్షులు తానేటి శేఖర్ మాదిగ, పోడూరు గ్రామ అధ్యక్షులు ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కండెల్లి సునీల్ బాబు మాదిగ, ఆరుగొల్లు మాధవ మాదిగ, తానేటి దుర్గారావు మాదిగ, తదితర ఎంఆర్పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పై దాడి అమానుషం






ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతారపు.

**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 17:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్ పై దాడి అమానుషం, అనైతకం అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతారపు రాజు అన్నారు. చీఫ్ జస్టిస్ పై దాడిని ఖండిస్తూ స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అనంతరపు రాజు మాట్లాడుతూ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయ్ మీద దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి శిక్షలు పడేలా స్వతంత్ర దర్యాప్తు చేయాలన్నారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టి, చీఫ్ జస్టిస్ పై అహంకారంతో దాడి చేసిన వ్యక్తిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. అక్టోబర్ 7, 2025 రోజున భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి బెంచ్ మీద లాయర్ల వాదనలు వింటున్న సమయంలో రాజేష్ కిషోర్ అనే వ్యక్తి షూస్ విసిరి దాడికి పాల్పడడం న్యాయవ్యవస్థ పై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. ఈ దుశ్చర్య న్యాయవ్యవస్థ చరిత్రలో మాయని మచ్చగా ఉందని అన్నారు. చీఫ్ జస్టిస్ మీద జరిగిన దాడి అనాగరికమైందని, ఈ దాడి దేశవ్యాప్తంగా ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది అన్నారు. దళిత, పీడిత వర్గాల ప్రజలను తీవ్ర మనోవేదనకు గురి చేసిందన్నారు. దేశ ప్రజలందరూ ఈ దాడిని ముక్తకంఠంతో ఖండించాలని, దాడికి పాల్పడ్డ వ్యక్తి పై తక్షణమే కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి అన్నారు. దాడి వెనుక ఉన్న అసాంఘిక శక్తులను గుర్తించి వారికి శిక్షలు పడేలా సమగ్రమైన దర్యాప్తు జరిపించాలి అన్నారు. సత్వర న్యాయం కోసం సుప్రీం కోర్టు రిటైర్డు జడ్జీలను దర్యాప్తు కోసం నియమించాలి అలాగే ఇలాంటి ఘటనలు ఉన్నత న్యాయవ్యవస్థల్లో పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి. ఈ డిమాండ్లను తక్షణమే పరిగణలోని తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్వో కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వంగలపూడి నాగబాబు, మసిరపు నాగేశ్వరరావు, శశి వెంకటేష్, పలివెల దొరబాబు, జొన్నాడ విజయ్ కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్కెట్లోకి కొత్తగా మారుతి విక్టోరిస్ కారు విడుదల చేసిన జబర్దస్త్ రైసింగ్ రాజు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 18**
దేశంలో లగ్జరీ కార్ల రంగంలో అగ్రస్థానంలో ఉన్న మారుతి సుజుకి ఈ సెగ్మెంట్ లో మార్కెట్లోకి కొత్త అధునాతన ఫీచర్స్ తో
విక్టోరిస్ కారు ను విడుదల చేసింది. స్థానిక ఆథరైజ్డ్ డీలర్ వరుణ్ మోటార్స్ లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జబర్దస్త్ టీం రైజింగ్ రాజు, ఎస్ బి ఐ డి జి ఎం పంకజ్ లు, జిఎస్ఎల్ మెడికల్ కళాశాల సూపర్డెంట్ కమల్ గుప్తా ముఖ్య అతిథిలుగా పాల్గొని తొలి కారును విడుదల చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ జి ఎన్ ఎస్ రామకృష్ణ మాట్లాడుతూ, మారుతి సుజుకి ఎస్ యు వి సెగ్మెంట్లో ఫైవ్ స్టార్ రేటింగ్ తో, వృద్ధుల, పిల్లల రక్షణ వ్యవస్థ తో పెట్రోలు, సిఎన్జి హైబ్రిడ్ వెర్షన్ మార్కెట్లో వినియోగదారులను ఆకట్టుకుంటుందన్నారు. ఈ సెగ్మెంట్లో ఉన్న ఇతర కంపెనీల కార్ల కన్నా పది రెట్లు అధునాతన సౌకర్యాలు ఈ కార్లో లభిస్తున్నాయన్నారు. పెట్రోల్ వెర్షన్ ధర రూ.13 లక్షల నుంచి 24 లక్షల వరకు, సిఎన్జి వెర్షన్ రూ .14 లక్షల నుంచి 18. 82 లక్షల వరకు హై ఎండ్ స్థాయి లో లభిస్తున్నాయన్నారు. జిఎస్టి 2.0 లో భాగంగా 40 శాతం తగ్గింపు ఉంటుందన్నారు. ఇంత వరకు 50 కార్లు బుకింగ్ అయ్యాయని అన్నారు.ఈ కార్యక్రమంలో వరుణ్ మోటార్స్ సీఈఓ గిరిబాబు, ఆర్టీవో ఆర్ సురేష్, సీనియర్ ఎంవి ఐ శ్రీనివాసరావు, మధు కాను మూర్తి లక్ష్మీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## సిరుపురంలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం.

గురువులకు అపూర్వ స్వాగతం, ఘన సన్మానం.







**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 17:** మండల పరిధి సిరిపురం గ్రామంలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990–95 సంవత్సరాల లో విద్యనభ్యసించిన విద్యార్థినీ విద్యార్థులు అపూర్వ సమ్మేళన కార్యక్రమం చిన్నంపేట గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి ఎల్లపు వీరభద్రరావు (అబ్బులు తనయుడు), ఎల్లపు సురేంద్ర, రేణుక ఆర్థిక సహాయంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు సకుటుంబ సపరివార సమేతంగా హాజరయ్యి తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ రోజు తాము ఈ స్థాయికి వచ్చామంటే తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయుల కృషియని కొని ఆడారు. ఎన్నడూ లేని విధంగా సిరిపురంలో ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థుల నుంచి అపూర్వ రీతిలో ఘన స్వాగత సత్కారాలు అందాయి. ఈ కార్యక్రమంలో తొలుత తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను గుర్రాల రథంపై వేదమంత్రాలతో, మంగళ వాయిద్యాల మధ్య బాజా భజంత్రీలతో బాణాసంచా కలుస్తూ గురువులపై పూల వర్షం కురిపిస్తూ ఊరంతా ఊరేగిస్తూ పాఠశాలకు స్వాగతం పలికారు.గురువులకు సన్మానం చేస్తూ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ శాంతికి చిహ్నమైన పావురాలను ఎగరవేశారు.ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్క విద్యార్థినీ విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తూ కష్టంలో ఉన్న స్నేహితులకు , ఆపదలో ఉన్న ఎవరికైనా తమ వంతు సహాయంగా కొంత సొమ్మును ప్రకటించి ప్రతి సంవత్సరం ఎవరో ఒక్కరికి సహాయం చేయాలనితీర్మానం చేశారు.ఈ కార్యక్రమానికి విద్యాబుద్ధులను బోధించిన గురువులకు ఎస్.జహరుద్దీన్ , ఎన్ .తిరుపతిరావు, ఐ ఎల్ ఎం రాజు పూలమాలలు వేసి, దుస్సాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య నిర్వాహకులుగా పాసిల తాతారావు, మేడిది సింహాచలం, పలివెల సూర్య కుమార్, తిబిరిశెట్టి శ్రీనివాస్, షేక్ బాను, కొట్టన శ్రీను మంగా దంపతులు సహాయ సహకారాలు అందించగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం పూర్వ విద్యార్థినీ విద్యార్థుల ఆత్మీయ సమావేశంతో పండగ వాతావరణం నెలకొంది.

## మద్యం వ్యాపారులతో తాను సమావేశం పెట్టినట్లు నిరూపిస్తారా ?



- నగర టిడిపి అధ్యక్షుడు మజ్జి రాంబాబు సవాల్
- ఈ సంఘటనపై పోలీసులకు పిర్యాదు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 18**
మద్యం వ్యాపారులతో తాను ఫోనులో మాట్లాడినట్లుగా వైరల్ అవుతున్న గొంతు తనది కాదని, అది ఫేక్ అని నగర టిడిపి అధ్యక్షుడు మజ్జి రాంబాబు ఖండించారు. ఇటీవల ఆధునిక సాంకేతిక రంగంలో ఏ ఐ తో నకిలీ వీడియోలు, వాయిస్ లు సృష్టిస్తున్నట్లు చూస్తున్నామని ఇది కూడా అలాంటిదేనని ఆయన అన్నారు. ఈ సంఘటనపై పోలీసులకు పిర్యాదు చేశానన్నారు. స్థానిక శ్రీకన్య ఇన్ లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పోలీసులు దర్యాప్తు చేసి వాస్తవాలు బయట పెట్టాలని కోరారు. మద్యం వ్యాపారులతో తాను సమావేశం పెట్టినట్లు నిరూపించాలని సవాల్ చేసారు. తనకు లిక్కర్ షాపులు లేవని, లైసెన్సులు లేవని, మద్యం వ్యాపారులతో మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. కేవలం తన ఎదుగుదలను చూసి ఓర్వలేక అడ్డుకోడానికి మాజీ ఎంపీ భరత్ నకిలీ వీడియోలు, వాయిస్ లు చూపిస్తున్నారని, భరత్ జాగ్రత్త అని మజ్జి రాంబాబు హెచ్చరించారు

గతంలో కూడా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు లను తిట్టినట్లు ఒక ఫేక్ ఆడియోను భరత్ సృష్టించారని, ఆయనకు వైసీపీ కి ఇలాంటివి అలవాటేనని రాంబాబు అన్నారు. తనకు మద్యం షాపులు లేవని, ఉన్నట్లు నిరూపిస్తే రాసిస్తానని ఆయన ప్రకటించారు. , ఎమ్మెల్యే వాసు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల , మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు టీడీపీ నాయకులతో తనకు సత్సంబంధాలు ఉన్నాయన్నారు. గతంలో ఇయ్యపు కూర్మారావు, రౌతు సూర్యప్రకా శరావు వంటివాళ్ళు ఉల్లిపాయల వ్యాపారం చేసి ఎదిగారని, తాను కూడా అదే వ్యాపారం చేస్తున్నానన్నారు. ఈ వ్యాపారాన్ని కించపరిచేలా మాట్లాడ్డం భరత్ కి తగదన్నారు. వైసీపీలోని కొంతమందిని కోవర్టులుగా కూటమి పార్టీల్లోకి పంపించి కుట్ర రాజకీయాలు చేయాలని భరత్ చూస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ మీడియా సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు దాస్యం ప్రసాద్, ఈతలపాటి రవి, బొర్రా చిన్ని, సలాది ఆనంద్, బంగారు నాగేశ్వరరావు, యర్రంశెట్టి రాజ్ కుమార్, ఆదారి లక్ష్మీ నారాయణ, దుద్దేటి నాగేంద్ర, కడియాల వాసు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం...





**ఎటపాక,పెన్ పవర్,అక్టోబర్ 17:**మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి "అంతర్జాతీయ బాలిక దినోత్సవ" కార్యక్రమం నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ – సిడిపిఓ అరుణ అధ్యక్షత వహించారు.ప్రతి సంవత్సరం అక్టోబర్ 11 న అంతర్జాతీయ బాలిక దినోత్సవం జరుపుకుంటాం అని బాలికల యొక్క హక్కుల పరిరక్షణ,సంక్షేమం,భద్రత, సమానత్వం శక్తివంతమైన భవిష్యత్తు అందించడం దీని వెనక ఉన్న ఉద్దేశ్యం అని అన్నారు. బాలికలలో పోటీతత్వాన్ని అలాగే సమాజం లో జరిగే అంశాల పైన అవగాహన కల్పించే విధంగా అక్టోబర్ 11 వ తేదీ వ్యాసరచన,ఉపన్యాసం,ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన బాలికలకు సదరు పాఠశాల ఉపాధ్యాయుల మరియు ఎటపాక డిప్యూటీ ఎంపిడిఓ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.
బాలికల అభివృద్ధే లక్ష్యంగా అందరూ కృషి చెయ్యాలని
బాల్య వివాహాలు నిర్మూలించాలని,బాలికల పై వివక్ష తుడిచిపెట్టాలని, వారికి సురక్షితమైన వాతావరం కల్పించి వారి కలలను నెరవేర్చుకునే అవకాశాలు ఇవ్వాలనిఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, ఐ సి డి ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జస్టిస్ గవాయి పై దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన



**ఆలమూరు,పెన్ పవర్,అక్టోబర్ 17:**ఆలమూరు మండలంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు ఉండ్రాజపు పెద్దరాజు, జిల్లా ఇంచార్జ్ డాన్ సూరి మాదిగ ఆధ్వర్యంలో భారత అత్యున్నత న్యాయస్థానం జడ్జి జస్టిస్ గవాయి మీద జరిగిన దాడికి నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రమైన ఆలమూరు తహశీల్దార్ కే జే ప్రకాశ్ బాబు కు దాడిచేసిన వ్యక్తి మీద కఠిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. 78 ఏళ్ల స్వాతంత్ర భారత దేశంలో ప్రధాన మంత్రులు మారు తున్నారు, ముఖ్యమంత్రులు మారుతున్నారు కానీ, ఈ భారతదేశంలో ఉండే దళితుల మీద దాడులు ఎప్పటికప్పుడు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇది అత్యంత శోచనీయం గా భావిస్తూ న్యాయ వ్యవస్థ పై నమ్మకం కలిగేలా ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము నారాయడు, లంక వెంకటరమణ, ఉండ్రాజు ప్రసాద్, పలివెల తేజ,లాజర్, ఉండ్రాజు గిరీష్, పలివెల ఆనంద్ లంక శ్యామ్,పేరవరం సత్తిబాబు, కొడమంచిలి హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి..




**ఎటపాక, పెన్ పవర్,అక్టోబర్ 17:**అల్లూరు జిల్లా అల్లూరి జిల్లా ఎటపాక మండల పరిధి దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా వ్యాపారులు తప్పనిసరిగా అమ్మకాలకు సంబంధించి అనుమతులు తీసుకోవాలని ఎటపాక మండలం సర్కిల్ ఇన్స్పెక్టర్ కన్నపరాజు ఓ ప్రకటనలో తెలిపారు, ఎవరైనా వ్యాపారస్తులు అనుమతులు లేకుండా బాన సంచ అమ్మకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు, భద్రత దృష్ట్యా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు, అదేవిధంగా విఆర్. పురం, కూనవరం మండలాలలో కూడా అనుమతులు తీసుకోవాలని తెలిపారు.

## గర్భిణులు - బాలింతల ఆరోగ్యం పై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరణ

- ఐసీడీఎస్ పథకాలపై అధికారుల సమీక్ష
- అంగన్‌వాడీ సిబ్బందికి స్పష్టమైన సూచనలు



**పెనుమంట్ర, పెన్ పవర్, అక్టోబర్ 17:**
సమాజ అభివృద్ధి గర్భిణులు, బాలింతల ఆరోగ్యం మీద ఆధారపడి ఉంటుందని సీడీపీఓ ఎం. ఉమా అన్నారు.శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం లో బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్యం, పోషకాహార పంపిణీ, ఆహార నాణ్యత, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా సీడీపీఓ ఎం. ఉమా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా, ప్రతి తల్లి శిశువు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. అంగన్‌వాడీ సిబ్బంది క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించడం, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం చాలా అవసరమని సూచించారు.
పోడూరు గ్రామ మాజీ సర్పంచ్ రుద్రరాజు సుజాత మాట్లాడుతూ, గ్రామాల్లో తల్లులు, పిల్లలు పౌష్టికాహారం గురించి అవగాహన పెంపొందించుకోవాలని, అంగన్‌వాడీ సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అధికారుల సమీక్షలో ఐసీడీఎస్ సెంటర్లలో ఆహార నాణ్యత, తల్లిదండ్రుల భాగస్వామ్యం, పోషకాహార విలువలు, తల్లిదండ్రుల అవగాహన కార్యక్రమాలు వంటి అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేశారు.
ఈ కార్యక్రమం లో ఎం.ఇ.ఓ. సత్యనారాయణ, అదనపు సీడీపీఓ పి. నాగారత్న, పి.హెచ్.ఎన్. మీరా, ఎ.ఎన్.ఎమ్. పి. శ్రీదేవి, పి. జయంతి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు కె. మోహన్ రాణి, జి. హేమతులసి, ఆశా వర్కర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలని -ఎం.ఆర్.పి.ఎస్ డిమాండ్



**ఆత్రేయపురం, పెన్ పవర్ అక్టోబర్ 17:**పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయ్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, దాడికి పాల్పడిన వ్యక్తి రాకేష్ కిషోర్ ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమం ఎం.ఆర్.పి.ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర రాఘవ మాదిగ ఆధ్వర్యంలో ఆత్రేయపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగింది. ఈ సందర్భంగా ఎం.ఆర్.పి.ఎస్ మండల అధ్యక్షుడు లకారపు చంద్రశేఖర్, మండల యువసేన అధ్యక్షుడు లంకా ప్రేమకుమార్లు, మండల డిప్యూటీ తహసీల్దార్ రాపాక శ్రీరామచంద్రమూర్తి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మందపల్లి భానులకు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా రాఘవ మాదిగ మాట్లాడుతూ సుప్రీం కోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో చీఫ్ జస్టిస్ గవాయ్‌పై షూలు విసరడం అనాగరిక చర్య. ఇది ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, న్యాయవ్యవస్థకు జరిగిన దాడి. ఈ సంఘటన దేశ ప్రజలను, ముఖ్యంగా దళిత, పీడిత వర్గాలను తీవ్ర మనోవేదనకు గురి చేసింది," అని పేర్కొన్నారు.

దళితుడైన బి.ఆర్. గవాయ్ చీఫ్ జస్టిస్ కావడాన్ని కొన్ని ఆధిపత్య వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయని, అందుకే ఈ విధమైన అహంకార దాడికి తెగపడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

దోషి రాకేష్ కిషోర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, దాడి వెనుక ఉన్న శక్తులను బహిర్గతం చేయాలని, సుప్రీం కోర్టు సీనియర్ జడ్జిలతో కూడిన స్వతంత్ర దర్యాప్తు కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.పి.ఎస్ సీనియర్ నాయకులు పోసిపో మిరాబి మాదిగ, ముప్పిడి రాజు (పండు), రాచర్ల అరుణ్ కుమార్, యార్లగడ్డ ఏలియ్య (వీఆర్ఓ), వేమగిరి శేషు, సిరిపెల్ల బాబి, కౌలూరి కళ్యాణ్, దిగుమర్తి ధనుష్, యార్లగడ్డ కిరణ్, యార్లగడ్డ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం వ్యాపారులను రాజకీయాలలోకి లాగడం సరికాదు

- 20 శాతం కమిషన్ అని చెప్పిన ప్రభుత్వం 14 శాతమే ఇవ్వడం వల్ల నష్టం
- వ్యాపారంలో అక్రమాలు లేవని ఖండించిన రాజమండ్రి మద్యం వ్యాపారుల సంఘం నాయకులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 17**
ఇప్పటికే లక్షల రూపాయలు అప్పులు చేసి మద్యం వ్యాపారం చేస్తున్నామని, ఈ పరిస్థితుల్లో తమను రాజకీయాల్లోకి లాగడం సరికాదని అన్ని రాజకీయ పక్షాలకు రాజమండ్రి మద్యం వ్యాపారుల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఇటీవల కొంతకాలంగా రాష్ట్రంలో మద్యం వ్యాపారంపై ఆరోపణలు అక్రమాలపై హల్చల్ చేయడం తమను ఆవేదనకు గురి చేసాయని అన్నారు . శుక్రవారం సంఘం నాయకులు అధ్యక్షులు దేవరపల్లి కృష్ణ, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బాల సుబ్రహ్మణ్యం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం వ్యాపారులకు 20 శాతం కమిషన్ ఇస్తానని ప్రకటించడంతో ఈ రంగంలోకి చాలామంది పాతవారు , కొత్తవారు వచ్చారన్నారు. అప్పులు చేసి లక్షలు ఖర్చు పెట్టి ఒకరిద్దరూ భాగస్వామ్యంతో లాటరీ విధానములో షాపులు పొందామన్నారు. అయితే ప్రభుత్వం 14 శాతం కమిషన్ ఇవ్వడంతో వ్యాపారులందరూ తీవ్రంగా నష్టపోయారని, పైగా పర్మిట్ రూముల పేరట ఏడున్నర లక్ష రూపాయలు వసూలు చేయడం కూడా మూలిగే నక్కపై తాటి పండు పడినట్లుగా నష్టపోయామన్నారు. తమ వ్యాపారంతో సంబంధంలేని వ్యక్తుల రాజకీయాలను తమ వ్యాపారానికి ఆపాదించడం సరికాదన్నారు. ప్రభుత్వ చర్య లు వల్ల తాము వ్యాపారాలు నడుస్తున్నాయని, అవసరమైతే వచ్చే సంవత్సరం లైసెన్స్ లు ముగిసిన వెంటనే షాపులను విరమించుకుంటామని స్పష్టం చేశారు. వ్యాపారులుగా తమకు అన్ని రాజకీయ పక్షాలు ,నాయకులు కావాలని వారితో సత్సంబంధాలు కలిగి ఉంటామని తమ వ్యాపారంలోని వైసిపి వారు ఉన్నారన్నారు. రాష్ట్రంలో జరిగే కల్తీ మద్యం రాజమండ్రి షాపులకు ముడి పెట్టడం తగదని, ఏమైనా అలాంటివి జరిగితే చర్య తీసుకోవడానికి ఎక్సైజ్ అధికారులు ఉన్నారన్నారు. నగరంలోని మద్యం షాపుల్లో ఎమ్మార్పీ కన్నా అదనంగా వసూళ్ళు చేయడం లేదని, బెల్ట్ షాపులు నడపడం లేదని, పర్మిట్ రూములు కూడా ఉన్నాయన్నామన్నారు. జాతీయ రహదారి పక్కన షాపులు ఏర్పాటు చేయడం సుప్రీంకోర్టు నిబంధనల మేరకే ఏర్పాటు చేశామన్నారు. మీ సమావేశంలో సంఘం నాయకులు సానబోయిన సత్యనారాయణ మేక రమేషు , సానబోయిన సురేష్, ఆకుల శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు , వాహనదారులు రహదారి భద్రతా నియమాలు పాటించాలి

**- కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి నరసింహా కిషోర్**




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 17:**రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రజలు , వాహనదారులు రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేసారు

శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశాన్ని ఎస్పీ , జాయింట్ కలెక్టర్ తో కలిసి కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో తరచుగా జరిగే ప్రమాదాలు, గుర్తించిన బ్లాక్ స్పాట్లు, ప్రమాదాల ప్రధాన కారణాలు, నివారణ చర్యలపై అధికారులు కలెక్టర్ కి వివరించారు.జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, జిల్లాలో ముఖ్యంగా జాతీయ రహదారులపై ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటు న్నాయని పేర్కొన్నారు. నిడదవోలు, పెరవలి, రాజానగరం గామన్ బ్రిడ్జ్, నల్లజర్ల ప్రాంతాల్లో ప్రమాదాల సంఖ్య అధికంగా ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 33 ప్రమాదావకాశాలు ఉన్న బ్లాక్ స్పాట్లను గుర్తించామని సంబంధిత అధికారులు సైన్ బోర్డులు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.రాజానగరం%–%కాకినాడ ఏడీబీ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో, పోలీస్, ట్రాన్స్‌పోర్ట్, ఆర్అండ్‌బి, రెవెన్యూ, జాతీయ రహదారుల శాఖలు సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో అవసరం లేని మీడియన్స్ మూసివేయాలని సూచించారు.ప్రమాదాల నియంత్రణతో పాటు ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంచడం చాలా అవసరమని చెప్పారు. విద్యార్థులు, డ్రైవర్లకు రహదారి భద్రతా వారోత్సవాలు తరచుగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.జిల్లా ఎస్పీ డి . నరసింహ కిషోర్ మాట్లాడుతూ ,జాతీయ రహదారులపై అధిక వేగంతో వెళుతున్న వాహనాల వివరాలను జాతీయ రహదారి అథారిటీ నుంచి పోలీస్ శాఖకు అందిస్తే, చలానాలు జారీ చేసే చర్యలు చేపడతామని తెలిపారు. టోయింగ్ వెహికిల్స్ సంఖ్య పెంచే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణంలో రహదారి ఆక్రమణల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, తొలగించే చర్యలు ప్రారంభిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ వై. మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, డిటిఓ ఆర్..సురేష్, ఆర్ అండ్ బి ఈఈ ఎస్బివి రెడ్డి ఆర్టీసీ ఆర్ఎం కె మాధవ్, , జాతీయ రహదారి భద్రత అధికారి , డీ ఐ పీఆర్వో కె లక్ష్మీ నారాయణ, సంక్షేమ శాఖ అధికారులు జియాద్దీన్, కె ఎస్ జ్యోతి, బి. శశాంక, ఆర్ ఎమ్ సి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్రేయపురం తహశీల్దార్ టి. రాజేశ్వరరావుకు డిప్యూటీ కలెక్టర్ పదోన్నతి





**ఆత్రేయపురం, పెన్ పవర్ అక్టోబర్ 17:**ఆత్రేయపురం తహశీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న టి. రాజేశ్వరరావు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయనకు సహోద్యోగులు, సిబ్బంది, శుక్రవారం రెవిన్యూ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు ఘనంగా అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఆర్.డి. రామచంద్రమూర్తి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వై. భాను, కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, రేషన్ షాపు డీలర్లు తదితరులు రాజేశ్వరరావును పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భం లో రాజేశ్వరరావు మాట్లాడుతూ ం
"పదోన్నతి నా వ్యక్తిగత విజయమేగాక, మా మండల రెవెన్యూ సిబ్బంది కృషికి ప్రతిఫలం. ప్రజాసేవలో మరింత నిబద్ధతతో పనిచేస్తానని" అన్నారు.భక్తి, సేవ, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచిన రాజేశ్వరరావు పదోన్నతితో ఆత్రేయపురం రెవెన్యూ కార్యాలయంలో ఆనంద వాతావరణం నెలకొంది.

# ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు




**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 17:** జగ్గంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెద్దాపురం ఆర్డీవో శ్రీ రమణి హాజరయ్యారు. ధాన్యం కొనుగోలు ప్రాముఖ్యతను సిబ్బందికి వివరించారు. ధాన్యం ఎలా సేకరించాలో తెలిపారు. ప్రధానంగా జగ్గంపేట మండలంలో వరి 3892 హెక్టార్లలో సాగు చేయడం జరుగుతుందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పంటను నమోదు కార్యక్రమాన్ని సక్రమంగా పూర్తి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి తెలియజేసారు. అలాగే రైతు సేవ కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయుటకు కావలసినటువంటి అన్ని సదుపాయాలను సొసైటీ వారు ఏర్పాటు చేయాలన్నారు. గోనె సంచులు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట సహాయ సంచాలకులు జి శ్రీనివాస్, జగ్గంపేట మండలం వ్యవసాయ అధికారి నరసింహం, తహసిల్దార్ రమేష్, ఎంపీడీవో చంద్రశేఖర్, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, సొసైటీ అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

## ఎంపిపి గా శ్రీనివాస్



**కపిలేశ్వరపురం పెన్ పవర్ అక్టోబర్ 17 :**కపిలేశ్వరపురం మండల%శీ% అద్దంకి వారి లంక ఎంపీటీసీ ,వైస్ ఎంపీపీ గా ఉన్న సాకా శ్రీనివాస్ శుక్రవారం మండల పరిషత్ అధ్యక్షుని గా బాధ్యులు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, వర్గ విబేధాలకు తావు లేకుండా మనకప్పగించిన పనిని అంకిత భావంతో పని చేస్తానని మండపేట నియోజకవర్గం శ్రీనివాస్ అన్నారు. కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను పలువురు నాయకులు, అధికారులు అభినందించారు.దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి మండల పరిషత్తు అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించడం చాలా సంతోషంగా ఉందని %గ్గాుజ% సభ్యులు పుట్టపూడి అబ్బు అన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల ప్రజాప్రతినిధులు మండల పరిషత్ సిబ్బంది ఎంపీపీ శ్రీనివాస్ ను దుశ్శలువా కప్పి పూల దండలతో ఘనం గా సన్మానించారు.

# జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణానికి మళ్లీ టెండర్లు

### ప్రస్తుత కాంట్రాక్ట్ సంస్థ రద్దు..




**ఆలమూరు, పెన్ పవర్ అక్టోబర్ 16:**ఎన్నో ఏళ్ల నుంచి నత్తనడకన సాగుతున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ ఫ్లై ఓవర్ నిర్మాణ కాంటాక్ట్ రద్దు అయింది. ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జాప్యం వల్ల వాహనదారులు పడరానిపాట్లు పడుతున్నారు. దీనిపై కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ లు ఎన్నిసార్లు జిల్లా స్థాయిలో సమీక్ష జరిగినప్పటికీ ఫలితం లేకపోయింది. చివరికి ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో కోనసీమ కలెక్టర్ మహేష్ కుమార్ చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. పని చేయని ఆ కాంటాక్ట్ సంస్థ ను రద్దు చేయాలని సిఎం ఆదేశించారు. దీనిపై ఆ కాంట్రాక్ట్ సంస్థ కు నోటీసు ఇవ్వగా ఈ నిర్మాణ పనుల నుంచి ఆ సంస్థ తప్పుకోవడానికి సిద్ధమని లిఖిత పూర్వకంగా రాసిచ్చింది. దీంతో ఎలాంటి లీగల్ సమస్య లేకుండా వచ్చే నెలలో మళ్లీ టెండర్లు పిలచి వేరే కాంట్రాక్ట్ సంస్థ కు అప్పగించడానికి నేషనల్ హైవే అధారిటీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ ఫ్లై ఓవర్ ఫిల్లర్స్ పూర్తయ్యాయి. గడ్డర్స్ కూడా నిర్మించి సిద్ధంగా ఉంచారు. వాటిని పిల్లర్స్ పై పెట్టి స్లాబ్ వేస్తే సరిపోతుంది. అదేవిధంగా అప్రోచ్ రోడ్ వాల్ కి అవసరమైన కాంక్రీట్ దిమ్మలు కూడా జొన్నాడ శివాలయం ఆవరణలో తయారుచేసి సిద్ధంగా ఉన్నాయి. అదే పనిగా చేపడితే రెండు నెలల్లో ఫ్లైఓవర్ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. పాత కాంట్రాక్ట్ సంస్థకు ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు చెల్లించి కొత్త కాంటాక్ట్ కొనసాగించడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఏళ్ళ తరబడి ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయకపోవడం వల్ల వాహనదారులు ఇటుగా వెళ్లడానికి నరకం చూడాల్సి వస్తుంది. దీనిపై మీడియా, సోషల్ మీడియాలో ఎన్ని వార్తలు వచ్చినప్పటికీ ఆ కాంటాక్ట్ సంస్థ ఎందుకో చొరవ చూపలేదు. 2022 సెప్టెంబరు 22 జాతీయ రహదారులు, రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గట్కరీ రాజమహేంద్రవరం వచ్చి ఈ ప్యాకేజీకి శంకుస్థాపన చేశారు. ఇదే ప్యాకేజీ లో ఉన్న మోరంపూడి ఫ్లైఓవర్ ప్రారంభించి ఏడాది అవుతున్న జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణం మాత్రం ముందుకు సాగలేదు. కొత్త కాంట్రాక్ట్ సంస్థ ద్వారా పనులు వేగవంతంగా జరగడానికి చర్యలు చేపడతారని ఆశిద్దాము.

# అనుమతి లేకుండా బాణసంచా విక్రయాలు...!








- బాణసంచా విక్రయాలపై నియంత్రణ శూన్యం..?
- పెన్ పవర్ ప్రత్యేక కథనం

**తణుకు /తాడేపల్లి గూడెం అక్టోబర్ 17 :**దీపావళి వేడుకల జోరుతో మార్కెట్లలో బాణసంచా విక్రయాలు ఉత్సాహంగా సాగుతున్నప్పటికీ, అధికార అనుమతులు లేకుండా తాత్కాలికంగా ఏర్పడుతున్న సెంటర్లు ప్రజల భద్రతకు పెద్ద ముప్పుగా మారుతున్నాయి. పట్టణంలోని ప్రధాన వీధులు, స్కూల్ పరిసరాలు, నివాస ప్రాంతాల దగ్గర కూడా బాణసంచా షాపులు తెరచి వ్యాపారం సాగిస్తున్నారు.

**బాణసంచా నియంత్రణలపై ప్రశ్నార్థకం :**

మున్సిపల్ మరియు ఫైర్ సేఫ్టీ శాఖల అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు జరగడం చట్ట విరుద్ధం. అయితే స్థానికంగా పరిశీలిస్తే, అనేక చోట్ల బాణసంచా స్టాళ్లు తెరచి ఉన్నాయన్నది వాస్తవం. ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఈ షాపులు ఉండడం వల్ల ప్రమాదం సంభవించే అవకాశం ఎక్కువగా ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**స్కూల్ పరిసర ప్రాంతాల్లో స్టాళ్లు :**

లూథరన్ హైస్కూల్ పరిసర ప్రాంతంలోనూ తాత్కాలిక బాణసంచా షాపులు ఏర్పడ్డాయి. విద్యార్థులు తరచుగా తిరిగే వీధుల్లో పేలుడు పదార్థాల విక్రయం జరుగుతుండడం తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఒక చిన్న నిర్లక్ష్యం జరిగినా ప్రమాదం తప్పదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**పర్యవేక్షణ లోపం :**

బాణసంచా సెంటర్ల అనుమతులు ఫైర్ డిపార్ట్‌మెంట్, పోలీస్ శాఖల నుండి రావాలి. కానీ ప్రస్తుతానికి ఎవరు పర్యవేక్షణ చేస్తున్నారనే ప్రశ్నకు సమాధానం కనబడడం లేదు. కొంతమంది వ్యాపారులు లైసెన్స్ పేరుతో పాత పత్రాలను చూపిస్తూ విక్రయాలు కొనసాగిస్తున్నారు.

**ప్రజల భద్రతే ప్రాధాన్యం :**

బాణసంచా వల్ల కాలిన గాయాలు, ఆస్తినష్టం, అగ్నిప్రమాదాలు ప్రతి ఏడాది పునరావృతమవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం ముందుగానే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సామాజిక సంస్థలు సూచిస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు, పశు వులు వంటి జీవులపై శబ్ధ కాలుష్యం ప్రభావం తీవ్రమని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**తక్షణ చర్యలే పరిష్కారం :**

ప్రజా ప్రదేశాల్లో అక్రమంగా కొనసాగుతున్న బాణసంచా విక్రయ కేంద్రాలపై అధికారులు తక్షణమే తనిఖీలు చేపట్టి, లైసెన్స్ లేని దుకాణాలను మూసివేయాల్సిన అవసరం ఉంది. విద్యాసంస్థల పరిసరాల్లో ఈ తరహా సెంటర్లను పూర్తిగా నిషేధించాలి.

దీపావళి ఉత్సవం ఆనందంగా జరుపుకోవాలంటే భద్రతా జాగ్రత్తలు తప్పనిసరి.

అధికారులు కఠిన చర్యలు తీసుకుంటేనే “అనుమతి ఉన్నా – బాణసంచాలే సురక్షితం!” అనే స్ఫూర్తి అందరికీ చేరుతుంది.

# నేడు గరుడ సేవలో జనార్ధన స్వామివారు





ధనత్రయోదశి పర్వదిన సందర్భంగా శనివారం నుండి ప్రతి వారం మండల కేంద్రమైన ఆలమూరు శ్రీదేవి,భూదేవి సమేత జనార్ధన స్వామివారి ఆలయంలో స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడసేవను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు తెలియజేశారు. నవవిధ భక్తి మార్గాల్లో దాస్య భక్తికి ప్రతీకైన గరుడాళ్వార్ ను అధిరోహించిన స్వామి వారిని సేవించడానికి సకల దేవతలు ఇలకు దిగి వస్తారని ప్రతీతి.అంతటి పవిత్రమైన గరుడవాహనసేవ గురించి ప్రముఖ వాగ్గేయకారుడు అన్నమాచార్యులు “ఇటు గరుడుని నీవెక్కినను... పట పట దిక్కులు బగ్గన బగిలె” అని కీర్తించారు. మరింతటి ఉన్నతమైన గరుడసేవ మన గ్రామంలో ప్రతీ శనివారం నిర్వహించుకోవడం గోప్ప విశేషమని స్వామివారికి ఇష్టమైన తొలిహారతి, గరుడసేవలను భక్తులందరూ తిలకించి స్వామి పరిపూర్ణ అనుగ్రహాన్ని పొందాలని ఈవో బి. నరేంద్ర పాలక సభ్యులన్నారు.

# అంబాజీపేటలో ఫుడ్ పాయిజన్ తో 20 మంది అస్వస్థతకు గురయ్యారు





**ఆసుపత్రిలో చికిత్స**

**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్, 17:**వివిధ రోజు వారి పనులు చేసుకుంటూ జీవనాదారం గడుపుతున్న కూలీలు ఫుడ్ పాయిజన్ బారిన పడ్డారు. బుధవారం ఆ కూలీలు అంబాజీపేటలో ఉన్న ఒక హెటల్ నుండి ప్రతీ రోజు లాగనే తీసుకు వచ్చిన టిఫిన్లు తిని అస్వస్థతకు గురయ్యారు. గురువారం స్థానిక వైద్యులతో చికిత్స చేయించుకున్నప్పటికీ వారికి స్వస్థత చేకూరకపోవడంతో అంబాజీపేట, అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలలో చికిత్స పొందుతున్నారు. కాగా శుక్రవారం రాత్రి అంబాజీపేటలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మాచవరంకు చెందిన 12 మంది బాధితులు చికిత్స పొందుతూ కోలుకుంటున్నారు. ప్రస్తుతానికి వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు. చికిత్స పొందుతున్న వారిలో కుసుమే యమున కుమారి, అరిగెల నాగలక్ష్మి, యలమంచలి సత్యనారాయణ, యలమంచలి తాతారావు, కుసుమ శ్రీ ‘ఆకాష్, నేలపూడి విజయకుమారి, కుసుమ భవాణి, సరేళ్ల నాగలక్ష్మి, యలమంచలి నాగరత్నం, కుసుమ విమలకుమారితో పాటు మరో 10 మంది అమలాపురంలోని వివిధ ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్నారు.

**ఫుడ్ పాయిజిన్పై భిన్న కథనాలు**

అంబాజీపేటలో బుధవారం కలకలం రేపిన ఫుడ్ పాయిజన్ కు సంబంధించి ఓ వైపు బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే ఈ సంఘటనకు సంబంధించి మరో వైపు భిన్నంగా కథనాలు వినపడుతున్నాయి. హెటల్ నుండి తెచ్చిన టిఫిన్ వల్లే ఫుడ్ పాయిజన్ జరిగిందిని కొంత మంది బాధితులు ఆరోపిస్తుంటే మరి కొంత మంది మాచవరంలో తయారు చేస్తున్న బెల్లం తయారీ కేంద్రంలో వెలువడిన వాయివుల వల్ల ఫుడ్ పాయిజన్ కు గురయ్యారని కొంతమంది చెబుతున్నారు. కాగా రెండు రోజులు క్రితం అమలాపురంలో జరిగిన ఫుడ్ పాయిజన్ కు సంబంధించి అధికారులు దాడులు చేస్తున్న తరుణంలో అంబాజీపేటలో కూడా ఫుడ్ పాయిజన్ జరగడం, శుక్రవారం రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందడం కలకలం రేపింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల నుండి పి.గన్నవరం సీఐ ఆర్. భీమరాజు, ఎస్సైలు కె.చిరంజీవి, బి.శివకృష్ణలు వివరాలు సేకరించారు.



## ఆలమూరు మండలాన్ని తూర్పులో విలీనంపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత



**ఆలమూరు, పెన్ పవర్,అక్టోబర్ 17:**జిల్లాల పునర్విభజనలో భాగంగా మార్పులు ,చేర్పులు చేసేందుకు ప్రభుత్వం నలుగురు మంత్రులతో కూడిన ఉపసంఘం ఏర్పాటుచేసి వినతి పత్రాలు స్వీకరిస్తున్నట్లు ఆలమూరు జేఏసీ నాయకులు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆలమూరు మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని అఖిల పక్ష సభ్యులు కోరుతూ రావులపాలెం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు క్యాంప్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్లో పాల్గొన్నారు. ముందుగా కొత్తపేట నియోజకవర్గం శాసనసభ్యులు బండారు సత్యానందరావుకి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. అన్ని పార్టీల నాయకులు, ప్రజలు, ఉద్యోగస్తులు అందరూ ముక్తకంఠంతో ఆలమూరు మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని కోరుకుంటున్నారన్నారు.ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు తాడి మధుసూదన్ రెడ్డి, కొప్పనాతి శ్రీనివాసరావు,కొండె రామకృష్ణ, సత్తిబాబు,చంద్రశేఖర్,యాళ్ళ రవిరాజు, రవికుమార్,మిద్దె పురుషోత్తం శలబంధురాజు,తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె బాటలో రాజపూడి పిహెచ్సి సిబ్బంది




**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 17:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు న్యాయబద్ధమైన హక్కుల కోసం సమ్మెబాట చేపడుతున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం జగ్గంపేట మండలం రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అందరూ నల్ల బ్యాడ్జి ధరించి విధులకు హాజరవుతూ వైద్యాధికారులకు మద్దతుగా నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ లక్ష్మీకాంతం, ఎంపీహెచ్ఈఓ ఉమామహేశ్వరరావు, హెచ్ఎస్ శంకర్, ఎల్ టి లవకుమార్, ఫార్మసిస్ట్ మణికంత, స్టాఫ్ నర్స్ నాగ పోచమ్మ, హెల్త్ అసిస్టెంట్ శివ, ఏఎన్ఎం వరలక్ష్మి, ఎల్ డి సి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి

రంపచోడవరం డిఎస్పి సాయిప్రసాద్




**గంగవరం, పెన్ పవర్ ,అక్టోబర్ 17:**ప్రజలు గంజాయి డ్రగ్స్ వంటి వ్యసనాల నుండి దూరంగా ఉండాలని రంపచోడవరం డిఎస్పి సాయి ప్రశాంత్ పిలుపునిచ్చారు. జగ్గంపాలెం, ఓజు బంద గ్రామాల్లో జన మైత్రి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిఎస్పి సాయి ప్రశాంత్ మాట్లాడుతూ ప్రజలకు మరియు విషయాలపై అవగాహన కల్పించారు. ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం గంజాయి పండించడం రవాణా చేయడం కలిగి ఉండటం వంటి చర్యలు కఠిన శిక్షలు ఉంటాయని గంజాయి సంబంధించి సమాచారం ఉన్నట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 1972 నెంబర్ కు సమాచారం అందించాలన్నారు. అలాగే సైబర్ నేరాలైన నకిలీ లోడ్ యాప్స్ ఓటీపీ మోసపూరిత లింకులు ఏఐ ఆధారిత మోసాలు పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు అపరిచితులతో ఆన్లైన్ చాటింగ్ లేదా వీడియో కాల్స్ ద్వారా మోసపోకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. అనుమానాస్పద కాల్స్ లేదా లింకులు వచ్చినప్పుడు తక్షణమే పోలీసులు సమాచారం అందించాలని ఆన్లైన్ మోసాలు గురైనట్లయితే 19 30 టోల్ ఫ్రీ నెంబర్ కి ఫిర్యాదు చేయాలన్నారు. రహదారి ప్రమాదాలు నివారించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని మద్యం సేవించి వాహనాలు నడపడం హెల్మెట్ ధరించకపోవడం డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం వంటి నేరాలకు ట్రాఫిక్ నిబంధనలను అనుసరించి శిక్షణ తప్పవు అన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనను పాటించాలన్నారు. చాలు త్వరలో పోలీస్ శాఖ ద్వారా పోస్టులు భర్తీలో యువతకు అవసరమైన ట్రైనింగ్ ఏర్పాటు చేస్తామని ఆసక్తి గల యువతీ యువకులు స్థానిక పోలీసులు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహమూర్తి గంగవరం ఎస్సై వెంకటేష్ పలువురు ప్రజాప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.

## గర్భిణులు - బాలింతల ఆరోగ్యం పై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరణ

- ఐసీడీఎస్ పథకాలపై అధికారుల సమీక్ష
- అంగన్‌వాడీ సిబ్బందికి స్పష్టమైన సూచనలు

**పెనుమంట్ర, పెన్ పవర్, అక్టోబర్ 17:**

సమాజ అభివృద్ధి గర్భిణులు, బాలింతల ఆరోగ్యం మీద ఆధారపడి ఉంటుందని సీడీపీఓ ఎం. ఉమా అన్నారు.శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం లో బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్యం, పోషకాహార పంపిణీ, ఆహార నాణ్యత, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా సీడీపీఓ ఎం. ఉమా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా, ప్రతి తల్లి శిశువు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. అంగన్‌వాడీ సిబ్బంది క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించడం, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం చాలా అవసరమని సూచించారు. పోడూరు గ్రామ మాజీ సర్పంచ్ రుద్రరాజు సుజాత మాట్లాడుతూ, గ్రామాల్లో తల్లులు, పిల్లలు పౌష్టికాహారం గురించి అవగాహన పెంపొందించుకోవాలని, అంగన్‌వాడీ సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అధికారుల సమీక్షలో ఐసీడీఎస్ సెంటర్లలో ఆహార నాణ్యత, తల్లిదండ్రుల భాగస్వామ్యం, పోషకాహార విలువలు, తల్లిదండ్రుల అవగాహన కార్యక్రమాలు వంటి అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేశారు.దఈ కార్యక్రమం లో ఎం.ఇ.ఒ. సత్యనారాయణ, అదనపు సీడీపీఓ పి. నాగారత్న, పి.హెచ్.ఎన్. మీరా, ఎ.ఎన్.ఎమ్. పి. శ్రీదేవి, పి. జయంతి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు కె. మోహన్ రాణి, జి. హేమతులసి, ఆశా వర్కర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రాధా... ఎందుకింత బాధ

**విజయవాడ, అక్టోబరు 17 పెన్ పవర్:** :బెజవాడ నాయకుడు వంగవీటి రాధా రాజకీయంగా చాలా నష్టపోతున్నారు. ఇప్పటికే దశాబ్ద కాలం నుంచి ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు. ఆయన ఉన్న పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ వంగవీటి రాధాకు ఎందుకో రాజకీయ పదవి దక్కడం లేదు. వంగవీటి రంగా కుమారుడిగా బలమైన కాపు సామాజికవర్గం నేతగా వంగవీటి రాధాకు సాధారణంగా పదవి వెతుక్కుంటూ రావాల్సి ఉంది. కానీ వంగవీటి రాధా విషయంలో మాత్రం అలా జరగడం లేదు. అందుకు కారణం కులం కార్డు ఇప్పుడు డైవర్ట్ అయిపోయిందంటున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎంట్రీతో వంగవీటి రాధాను పెద్దగా పట్టించుకోవడం లేదని ఆయన వర్గం నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి.వంగవీటి రాధా ఇప్పటికే అన్ని పార్టీలూ మారారు. కాంగ్రెస్, ప్రజారాజ్యం, వైసీపీ, టీడీపీ ఇలా నాలుగు పార్టీలు మారిన వంగవీటి రాధాకు చివరకు పోటీ చేయడానికి కూడా స్థానం దక్కని పరిస్థితి నెలకొనడంతో ఆయన రంగా అనుచరుల్లో బాధ అంతా ఇంతా కాదు. వంగవీటి కుటుంబానికి ఇప్పటికీ రాష్ట్ర రాజకీయాల్లో ఒక పేరు ఉంది. రంగా పేరుతో పాటు ఆయన విగ్రహాలు కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయి. రంగాను పేదల దేవుడిగా భావిస్తారు. కేవలం కాపు సామాజికవర్గానికి మాత్రమే కాకుండా రంగాకు అన్ని కులాల నుంచి అభిమానులు ఇప్పటికీ ఉన్నారు. కానీ వంగవీటి రాధా విషయంలో మాత్రం అది రివర్స్ అయిందంటున్నారు. రాధా కూడా పెద్దగా రాజకీయాలను పట్టించుకోకుండా తిరుగుతుండటం అనుచరులను కొంత అయోమయానికి గురి చేస్తుంది.. ఇక ఇటీవల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ వంగవీటి రాధాను పిలిపించుకుని మాట్లాడారు. దీంతో వంగవీటి రాధాకు కూడా పదవి రెడీ అయిందన్న ప్రచారం జరిగింది. ఆయనను అందుకే లోకేశ్ పిలిచి మరీ మాట్లాడారంటున్నారు. వంగవీటి రాధా హైదరాబాద్ లో ఉంటే అమరావతికి పిలిచి పదవిపై లోకేశ్ హామీ ఇచ్చినట్లు సమాచారం. గంట సేపు ఇద్దరి భేటీ కొనసాగింది. అయితే ఇటీవల వంగవీటి రాధా తన కుమార్తె వేడుకకు సందర్భంగా కొడాలి నాని, వల్లభనేని వంశీ హాజరు కావడంతో టీడీపీ సోషల్ మీడియాలో కొన్ని నెగిటివ్ కామెంట్స్ కనిపించాయి. అయినా వంగవీటి రాధాను టీడీపీ వదులుకోదని, ఆయనకు పదవి గ్యారంటీగా దక్కుతుందని అంటున్నారు. చూడాలి ఏం జరుగుతుందో?

## మాంస విక్రయాలకు కొత్త లైసెన్సింగ్ విధానం

**ఏలూరు, అక్టోబరు 17 పెన్ పవర్:**ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. చికెన్ షాపులు, విక్రయాలకు సంబంధించిన అంశంపై ఒక నిర్ణయానికి వచ్చింది. చికెన్ విక్రయాల్లో అక్రమాలను అరికట్టేందుకు కొత్త లైసెన్సింగ్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ చికెన్ వ్యాపారంలో పారదర్శకతను పెంచేందుకు లైసెన్సింగ్ విధానాన్ని ప్రవేశపెడుతోంది. దీని ద్వారా ప్రతి చికెన్ దుకాణానికి లైసెన్స్ తప్పనిసరి. ఈ లైసెన్సు ద్వారా కోళ్ల సప్లై చైన్ ను పూర్తిగా పర్యవేక్షించవచ్చు. పౌల్ట్రీ ఫారాల నుంచి కోళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి? షాపుల యజమానులు ఎవరికి అమ్ముతున్నారు? అనే విషయాలను ట్రాక్ చేసేలా పక్కా వ్యవస్థను ఏర్పాటు చేయాలని రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ బోర్డు తీర్మానం చేసింది. ఈ సమాచారాన్ని పక్కాగా నమోదు చేస్తారు.ఆహార రంగంలో చికెన్ అమ్మకాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. అయితే చికెన్ విక్రయాల్లో భారీగా అవకతవకలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల విజయవాడలో పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో.. సంస్థ చైర్మన్ ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. పశుసంవర్ధక శాఖ కీలక అధికారులు సైతం పాల్గొన్నారు. గతంలో జరిగిన మాంసం మాఫియా అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అందులో భాగంగా ప్రతి చికెన్ షాప్ కచ్చితంగా లైసెన్స్ తీసుకోవాల్సిందేనని తీర్మానించారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మాంసం దుకాణాల క్రమబద్ధీకరణ పై దృష్టి సారించింది. మున్సిపాలిటీలో మాంసం దుకాణాలపై అకాస్మిక దాడులు చేసి అక్రమాలను అరికట్టాలని నిర్ణయించింది. హొటల్సు రెస్టారెంట్ల నిర్వాహకులు తప్పనిసరిగా గుర్తింపు పొందిన చికెన్ షాపుల నుంచే మాంసం కొనుగోలు చేసేలా ప్రోత్సహించనుంది ఏపీ ప్రభుత్వం.సాధారణంగా పౌల్ట్రీ లో కోళ్లు పెరిగేందుకు స్టెరాయిడ్లు ఎక్కువగా వాడుతారు. అలా వాడితేనే కోళ్ల ఎదుగుదల ఉంటుంది. వ్యాపారం లాభసాటిగా ఉంటుంది. అయితే ఇకనుంచి స్టెరాయిడ్లు వాడకుండా ప్రభుత్వం తనిఖీలు ముమ్మరం చేయనుంది. స్టెరాయిడ్లు వాడిన కోళ్ల మాంసం తింటున్న వారికి అనారోగ్య సమస్యలు కలుగుతున్నాయి. అందుకే వాటిని నియంత్రించాలని నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు చికెన్ షాపుల్లో వ్యర్థాలను చేపలకు ఆహారంగా వాడుతున్న మాఫియాను అరికట్టి.. ప్రజారోగ్యాన్ని ఇబ్బందిగా కలగకుండా వ్యర్థాలను సేకరించి సురక్షితంగా పారవేయాలని కూడా ప్రభుత్వం ఆదేశించింది. మరోవైపు మాంస అభివృద్ధి సంస్థ ద్వారా మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఒక్కో మోడల్ దుకాణం ఏర్పాటు చేయాలని నిర్ణయించడం విశేషం. మొత్తానికైతే చికెన్ దుకాణదారుడు కచ్చితంగా లైసెన్స్ తీసుకునేలా నిర్ణయం తీసుకోవడం మాత్రం ఆహ్వానించదగ్గ పరిణామం

## తలగాచిపల్లి క్రాస్ వద్ద టైర్ పేలి దగ్ధమైన బస్సు.. 29 మంది క్షేమం

**అనంతపురం పెన్ పవర్:**గార్లదిన్నె మండలం తలగాచిపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై అర్ధరాత్రి పెను ప్రమాదం తప్పింది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బెంగళూరు నుంచి రాయచూర్ లోని దేవదుర్గకు వెళ్తుండగా మార్గమధ్య లో బస్సు టైర్ పగిలింది. మంటలు ఎగిసి పడటంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో బస్సులో ఉన్న 29 మంది ప్రయాణికులు అప్రమత్తమై సురక్షితంగా బయటపడ్డారు. ఎస్సై మహమ్మద్ గౌస్ ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు...

### నైరుతి తిరోగమనం..

## ఈశాన్యపు ఆగమనంఆ జిల్లాలకు భారీ వర్ష సూచ

**ముంబై, అక్టోబరు 17, పెన్ పవర్:**ఈశాన్య రుతుపవనాల ప్రభావం ఎక్కువగా ఆంధ్రప్రదేశ్‌తో పాటుగా తమిళనాడు, కర్ణాటక, కేరళ పాండిచ్చేరిలో ప్రభావం చూపించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఇక తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దక్షిణ కోస్తా తీరం వెంబడి 35-45కిమీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఏపీలోని ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని సమాచారం.మరోవైపు తెలంగాణ లోని నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ, కామారెడ్డి జిల్లాలలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతోంది. అలాగే మరి కొన్ని జిల్లాలలో అక్కడక్కడ తేలికపాటి ఉరుములతో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నారు. కాగా రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షాల సమయంలో వాగులు, చెరువులు, కాల్వల దగ్గరికి వెళ్లరాదని విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

### లంచం తీసుకుంటూ దొరికిన డీఐజీ..

## రహస్య స్థావరంలో బయటపడ్డ ఆస్తుల గుట్టు!

**ఛండీఘడ్, అక్టోబరు 17, పెన్ పవర్:**రూ. 8 లక్షల లంచం తీసుకుంటుండగా ఓ డిఐజితో పాటు ఒక ప్రైవేట్ వ్యక్తిని సిబిఐ అరెస్టు చేసింది. అరెస్టయిన ఐపీఎస్ అధికారి 2009 బ్యాచ్ కు చెందిన వ్యక్తి. ప్రస్తుతం పంజాబ్ పోలీస్ రోపర్ రేంజ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డిఐజి ఇల్లు, ఇతర ప్రాంగణాలలో జరిగిన దాడులలో సిబిఐ అనేక విలాసవంతమైన వస్తువులను స్వాధీనం చేసుకుంది.సీబీఐ తెలిపిన ప్రకారం, తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను పరిష్కరించేందుకు బదులుగా ఒక వ్యాపారవేత్త నుండి పంజాబ్ పోలీస్ రోపర్ రేంజ్ డిఐజి హర్చరణ్ సింగ్ భుల్లార్ రూ. 8 లక్షల లంచం డిమాండ్ చేశారు. తదుపరి పోలీసు చర్యలు తీసుకోకుండా ఉన్నాడని, చట్టవిరుద్ధమైన నెలవారీ చెల్లింపులు కూడా చేయాలని డిఐజి డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.బాధితుడి నుంచి ఫిర్యాదు అందిన తర్వాత అక్టోబర్ 16న సీబీఐ కేసు నమోదు చేసింది. చండీగఢ్‌లోని సెక్టార్ 21లో ఒక ఉచ్చును పన్నారు. నిందితుడి మధ్యవర్తి ద్వారా రూ. 8 లక్షలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ ఉచ్చులో, ఫిర్యాదుదారుడు డీఐజీకి కాల్ చేశాడని, ఆ అధికారి డబ్బు అందుకున్నట్లు అంగీకరించారని, మధ్యవర్తి, ఫిర్యాదుదారుడిని తన కార్యాలయానికి పిలిపించారని సీబీఐ పేర్కొంది. ఆ తర్వాత సీబీఐ బృందం డీఐజీని ఆయన కార్యాలయం నుంచి అరెస్టు చేసింది.ఈ దాడిలో, సిబిఐ డిఐజి ఇళ్ళు, ఇతర ప్రాంగణాల నుండి భారీ మొత్తంలో నగదు, విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుంది. వాటిలో దాదాపు రూ. 5 కోట్ల నగదు, 1.5 కిలోల బంగారం, ఆభరణాలు, పంజాబ్‌లోని ఆస్తులకు సంబంధించిన అనేక పత్రాలు, మెర్సిడెస్, ఆడి కార్లు, 22 ఖరీదైన గడియారాలు ఉన్నాయి. విదేశీ మద్యం సీసాలు, తుపాకులను కూడా స్వాధీనం చేసుకున్నారు.అదనంగా, ఇల్లు, ఇంటి ఆవరణ నుండి లాకర్ కీలు, 40 లీటర్ల విదేశీ మద్యం బాటిళ్లు, డబుల్ బ్యారెల్ గన్, ఒక పిస్టల్, ఒక రివాల్వర్, ఒక ఎయిర్ గన్ స్వాధీనం చేసుకున్నారు. మధ్యవర్తి నుండి 2.1 మిలియన్ల రూపాయల నగదును కూడా సీబీఐ స్వాధీనం చేసుకుంది. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అక్టోబర్ 17న కోర్టులో హాజరుపరుస్తామని సీబీఐ అధికారులు తెలిపారు. మరిన్ని సోదాలు, దర్యాప్తులు కొనసాగుతున్నాయని సీబీఐ పేర్కొంది.

## ప్రతి మద్యం బాటిల్‌పై ఉండే క్యూఆర్ కోడ్




**విజయవాడ, అక్టోబరు 17 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో నకిలీ మద్యం విక్రయాలను అరికట్టేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్'ను ప్రవేశపెట్టారు. ఈ యాప్ ద్వారా ప్రతి మద్యం బాటిల్‌పై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి .. అది నిజమైనదా కాదా తెలుసుకోవచ్చు. మద్యం షాపుల్లో అమ్మే ముందు బాటిళ్లను స్కాన్ చేయడం తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధనలు అమలు చేస్తున్నారు రాష్ట్రవ్యాప్తంగా మద్యం విక్రయాల్లో పారదర్శకత పెంచి, నకిలీ మద్యం మాఫియాను నిర్మూలిస్తాయని ప్రభుత్వం చెబుతోంది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలవుతున్న ఈ నిబంధనలు అక్టోబర్ 13 నుంచి రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా అమలు చేస్తున్నారు. కొత్త రూల్స్ ప్రకారం క్యూఆర్ కోడ్ స్కానింగ్ తప్పనిసరి చేశారు. ప్రతి మద్యం బాటిల్‌పై జియో-ట్యాగ్ చేసిన క్యూఆర్ కోడ్ ఉంటుంది. షాపుల్లో అమ్మే ముందు ఈ కోడ్‌ను స్కాన్ చేయాలి. ఇది బాటిల్ డిస్ట్రిబ్యూషన్, తయారీ, డెస్టినేషన్ వివరాలు చూపిస్తుంది. జియో-ట్యాగింగ్ వల్ల బాటిళ్లు నిర్దేశిత ప్రాంతాల్లో మాత్రమే విక్రయించాల్సి ఉంటుంది. బెల్టు దుకాణాలకు మద్యం వెళ్లదు. వినియోగదారులు 'ఏపీ ఎక్సైజ్ సురక్షా' యాప్‌ను డౌన్‌లోడ్ చేసి, బాటిల్‌పై క్యూఆర్ కోడ్ స్కాన్ చేయవచ్చు. ఇది బాటిల్ అథెంటిక్ కాదా, మాన్యుఫాక్చర్ డేట్, ఎక్స్‌పైరీ, బ్యాచ్ నంబర్ వంటి వివరాలు చూపిస్తుంది. యాప్ గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంది. మద్యం షాపుల లైసెన్స్ హోల్డర్లు స్కానింగ్ ప్రక్రియను అనుసరించకపోతే, లైసెన్స్ రద్దు, జరిమానాలు విధిస్తారు. ఇది రాష్ట్రంలోని 3,500కు పైగా మద్యం షాపులకు వర్తిస్తుంది. డిజిటల్ పేమెంట్ సిస్టమ్‌ను కూడా ఇంటిగ్రేట్ చేశారు. షాపుల్లో %ఖూ×/ు=% కోడ్ ద్వారా పేమెంట్స్ చేయవచ్చు, కానీ ఇది క్యూఆర్ కోడ్ స్కానింగ్‌తో సంబంధం లేదు. ఏపీలో ఇటీవల నకిలీ లిక్కర్ తయారు చేసే ముఠా పట్టుబడింది. అందుకే ఈ యాప్ సాయంతో నకిలీ లిక్కర్ అనేది లేకుండా చేయాలని నిర్ణయించారు. ఈ నిబంధనలు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ టాస్క్ ఫోర్స్‌లు ఏర్పాటు చేసింది. షాపుల్లో స్కానర్లు, ట్రైనింగ్ ఇస్తున్నారు. వినియోగదారులు యాప్ డౌన్‌లోడ్ చేసి, ఫీడ్‌బ్యాక్ ఇవ్వవచ్చు. ఇది బ్లాక్ మార్కెట్, బెల్ట్ షాపులను అరికట్టి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతుందని అధికారులు తెలిపారు.

## అనంతలో రేమండ్ గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు

**అనంతపురం, అక్టోబరు 17, పెన్ పవర్:**
ఏపీలో మరో ప్రఖ్యాత సంస్థ పెట్టుబడులతో వచ్చింది. రేమండ్ గ్రూప్ ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో రెండు గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు స్థాపించనుంది. ఏరోస్పేస్ మరియు ఆటోమోటివ్ సెక్టార్లలో ఈ ప్రాజెక్టులు రూ.1,000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్నాయి. ఇవి 5,400 ఉద్యోగాలు సృష్టిస్తాయి, రూ.695 కోట్ల ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందనున్నాయి. రేమండ్ గ్రూప్ ఏరోస్పేస్, ఆటో కాంపోనెంట్లలో తన వ్యాపారాలను విస్తరిస్తోంది. స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ ఈ ప్రాజెక్టులకు ఇప్పటికే క్లియరెన్స్ ఇచ్చింది. మొత్తం రూ.943 కోట్ల పెట్టుబడికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.695 కోట్లకు పైగా ప్రోత్సాహకాలు ఇస్తుంది . ఏరోస్పేస్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ గుడిపల్లిలో, ఆటోమోటివ్ యూనిట్ టెకులోడు గ్రామంలో ఏర్పాటు కానున్నాయి %జీఖ% మైని ప్రెసిషన్ టెక్నాలజీ కింద రూ.430 కోట్ల పెట్టుబడితో స్థాపిస్తారు. ఈ ప్రాజెక్టు 4,096 మందికి నేరుగా ఉద్యోగాలు కల్పిస్తుంది. %జీఖ% మైని గ్లోబల్ ఏరోస్పేస్ కింద 47 ఎకరాల్లో రూ.510 కోట్ల పెట్టుబడితో నిర్మాణం జరుగుతుంది. 1,400 ఉద్యోగాలు సృష్టిస్తుంది. ఈ ప్రాజెక్టులు రేమండ్ గ్రూప్‌ను హై-ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఆటో మరియు ఏరోస్పేస్ కాంపోనెంట్లలో మరింత బలోపేతం చేస్తాయి. 2023లో మైని ప్రెసిషన్ ప్రొడక్ట్స్ మెజారిటీ స్టేక్ కొనుగోలు చేసి, రేమండ్ గ్రూప్ ఏరోస్పేస్ మాన్యుఫాక్చరింగ్‌లోకి అడుగుపెట్టింది. 1973లో స్థాపించబడిన మైని ప్రెసిషన్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఆటోమోటివ్ మరియు ఇండస్ట్రియల్ కాంపోనెంట్ల మాన్యుఫాక్చరింగ్‌లో బలమైన వారసత్వం కలిగి ఉంది. 2004లో ఏరోస్పేస్‌లోకి అడుగుపెట్టి, గ్లోబల్ ఎయిర్‌క్రాఫ్ట్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్లకు మిషన్-క్రిటికల్ కాంపోనెంట్లు సరఫరా చేస్తోంది. మైని గ్లోబల్ ఏరోస్పేస్ లిమిటెడ్ ఏరోస్పేస్ మాన్యుఫాక్చరింగ్, ప్రెసిషన్ ఇంజినీరింగ్, హై-కాంప్లెక్సిటీ కాంపోనెంట్లు తయారీలో గ్లోబల్ ౧ , టియర్- సప్లయర్లకు విశ్వసనీయ పేరు. ఈ ప్రాజెక్ట్‌కు అనంతపురం ఎంపిక కావడంలో కీలక పాత్ర పోషించింది ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు. టెక్స్‌టైల్ రాజు రేమండ్, ఇప్పుడు అనంతపురం నుంచి ప్రపంచానికి హై-టెక్ భాగాలను పంపించబోతున్నది. ఇది కేవలం ఒక వెయ్యికోట్ల పెట్టుబడి కాదుఇది %ూౄ% భవిష్యత్తుపై, మౌలిక సదుపాయాలపై, యువతపై రేమండ్ నమ్మకం. సాంప్రదాయేతర రంగాల్లో ఉపాధి అవకాశాలు, స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊపునిచ్చే శక్తి, మరియు అనంతపురాన్ని దేశంలోనే ఒక ఏరోస్పేస్-ఆటోమోటివ్ హబ్‌గా తీర్చిదిద్దే శక్తివంతమైన అడుగుగా భావిస్తున్నారు.

## సింహపురిలో సైనికుల తగువలాటలు

**నెల్లూరు, అక్టోబరు 17, పెన్ పవర్:**
ఉమ్మడి నెల్లూరు జిల్లాలో జనసేన పార్టీ ప్రభావం అంతంత మాత్రమే. 2024 ఎన్నికలకు ముందు అప్పటి జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్ రెడ్డి జనసేనను వీడి వైసీపీలోకి వెళ్లడంతో అప్పటి నుంచి పార్టీ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. గునుకుల కిషోర్, నూనె మల్లికార్జున యాదవ్, సుజయ్ బాబు, నలిశెట్టి శ్రీధర్, వంటి నాయకులు తప్ప చెప్పుకోదగ్గ నాయకులెవరూ ఆ పార్టీలో లేకుండా పోయారు. దీంతో జనసేన పార్టీ ప్రభావం ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పెద్దగా కనిపించేది కాదు. ఉన్న నాయకులే ఏదో ఒక కార్యక్రమంతో జనాల్లోకి వస్తూ పార్టీని ఎంతో కొంత బలోపేతం చేయాలని ప్రయత్నించే వారు. జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో బలోపేతం దిశగా ముందుకెళ్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో జనసేన నేతల వర్గ విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. జనసేన నేత, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌ను టార్గెట్ చేసుకొని పార్టీలో మొదటి నుంచి ఉన్న నియోజకవర్గ ఇంచార్జిలందరూ తిరుగుబాటు ఎగుర వేశారు. అజయ్ కుమార్ యాంటీ వర్గం అంతా ఏకమై ఆరోపణలు, విమర్శలు గుప్పిస్తున్నారు.జిల్లాలో పార్టీని అజయ్ కుమార్ సర్వ నాశనం చేస్తున్నారని.. పార్టీని రోడ్డున పడేస్తున్నారని మండిపడుతున్నారు. తామందరం కష్టపడితే.. లాబీయింగ్ చేసి అజయ్ కుమార్ పదవి తెచ్చుకున్నారనేది ఆయన వ్యతిరేక వర్గం వాదన. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన నాయకులందరినీ పక్కన పెట్టేసి తన వర్గానికి చెందిన కొత్త వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని అజయ్ కుమార్ తీరును తప్పుబడుతున్నారు. అంతేకాక జనసేన నియోజకవర్గ ఇంచార్జిలకు పనులు చేయొద్దంటూ..మంత్రులకు, ఎమ్మెల్యేలకు అజయ్ కుమార్ సూచిస్తున్నారని ఆరోపిస్తున్నారు.పార్టీ అధికారంలోకి రావడానికి తామంతా కృషి చేస్తే.. తమ కష్టాన్ని అధిష్టానం దగ్గర తాకట్టు పెట్టి అజయ్ కుమార్ నామినేటెడ్ పదవి తెచ్చుకుని ఇలా చేస్తున్నారని విమర్శిస్తున్నారు. జిల్లాలో పార్టీ కోసం ఏనాడూ పని చేయకుండా, ఇప్పుడు పదవితో నెల్లూరుకు వచ్చి పార్టీలో గ్రూపులు కట్టి, గందరగోళానికి దారితీస్తున్నాడని ఫైర్ అవుతున్నారు. ఎన్నికల సమయంలోనే వెంకటగిరి నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఉన్న గూడూరు వెంకటేశ్వర్లు సైతం అజయ్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారట. జిల్లాలో పార్టీని నాశనం చేస్తున్నారంటూ తీవ్ర విమర్శలు అప్ప ట్లో కలకలం రేపాయి. జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అజయ్‌పై విమర్శలు వచ్చాయి.వేములపాటి అజయ్‌కుమార్ మొన్నటి వరకు కూడా రాజకీయాల్లో పెద్దగా పరిచయం లేని వ్యక్తి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నాగబాబులతో సన్నిహిత సంబంధాలున్న వ్యక్తి. ప్రభుత్వంలో జనసేన భాగమైనప్పటి నుంచి..నెల్లూరు జిల్లాలో అన్నీ తానై వ్యవహరిస్తున్నారట. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో జనసేనకు క్యాడర్ ఉంది. కోవూరు, వెంకటగిరి, ఆత్మకూరులో కూడా ఎంతో కొంత కార్యకర్తలు ఉన్నారు. ఆయా నియోజకవర్గాల్లో అజయ్ కుమార్ మరొక వర్గాన్ని ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.పవన్ కల్యాణ్, నాగబాబు దగ్గరికి ఎవరినీ పోనివ్వకుండా..అంతా తానే అన్నట్లు అజయ్ కుమార్ వ్యవహరిస్తున్నారట. ఇదే జనసేన పార్టీలో ముందు నుంచి పనిచేస్తున్న నేతలకు ఆగ్రహం తెప్పిస్తుందట. అజయ్ కుమార్‌ను కాదని ఎవరైనా పవన్ కల్యాణ్‌ను గానీ, నాదెండ్ల మనోహర్‌ను కానీ కలిస్తే వారిని దూరం పెట్టేలా వ్యవహరిస్తున్నారట. అందుకే నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు ఆధ్వర్యంలో..జనసేన నియోజకవర్గ ఇంచార్జిలంతా ఒక్కతాటిపైకి వచ్చి దుమ్మెత్తిపోస్తున్నారట.కూటమి

మంత్రులు, ఎమ్మెల్యేలతో..అజయ్ కుమార్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ పార్టీ బలోపేతం చేయకుండా గ్రూప్‌లను ప్రోత్సహిస్తున్నారని మండిపడుతున్నారు. పార్టీ బలోపేతానికి ఒక్క కార్యక్రమం కూడా ఆయన చేయడం లేదట. సొంతంగా కార్యక్రమం చేసేవారిని సైతం అడ్డుకుని ఇబ్బంది పెడుతున్నారట. అజయ్ కుమార్ లాంటి వ్యక్తులు నెల్లూరు జనసేనలో ఉంటే పార్టీ ఎప్పటికీ బలోపేతం కాదని నేతలు అధి ష్టానానికి ఫిర్యాదు చేశారట. సింహపురి జన సైనికుల వివాదంపై పవన్ కల్యాణ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

## ఇక రాఘవరెడ్డే...

**ఒంగోలు, అక్టోబరు 17 పెన్ పవర్:**
ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో మాగుంట కుటుంబానికి మంచి పట్టుంది. మాగుంట కుటుంబం నుంచి వరసగా పార్లమెంటు సభ్యులుగా ఎన్నికవుతూ వస్తున్నారు. 2019 ఎన్నికల్లో మాగుంట శ్రీనివాసులు రెడ్డి టీడీపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయినప్పటికీ 2024 ఎన్నికల్లో తిరిగి పోటీ చేసి గెలుపొందారు. అయితే మాగుంట శ్రీనివాసులు రెడ్డి చేసిన ప్రకటనతో ఆయన వారసుడిని ఒంగోలు ప్రజలు ఎంతమాత్రం ఆదరిస్తారన్నది ఇప్పుడు ప్రశ్న. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటు నియజకవర్గం నుంచి తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డి పోటీ చేస్తారని ప్రకటించారు. తాను రాజకీయంగా విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించుకున్నానని, అందుకే రాఘవరెడ్డిని ఎన్నికల బరిలో నిలపాలని నిర్ణయించుకున్నట్లు మాగుంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం చరిత్ర చూస్తే టీడీపీ గెలిచింది మూడు సార్లు మాత్రమే. మొత్తం ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గానికి పద్దెనిమిదిసార్లు ఎన్నికలు జరిగితే ఇక్కడ తెలుగుదేశం పార్టీ గెలిచింది మూడు సార్లు మాత్రమే. 1984లో టీడీపీ పార్టీ స్థాపించిన కొత్తలో బెజవాడ పాపిరెడ్డి ఇక్కడి నుంచి గెలుపొందారు. తర్వాత 1999 ఎన్నికల్లో టీడీపీ నుంచి కరణం బలరాం కృష్ణమూర్తి గెలిచారు. మూడో సారి 2024 ఎన్నికల్లో మాగుంట శ్రీనివాసులు రెడ్డి గెలుపొందారు. అంటే టీడీపీ కంటే ఇక్కడ కాంగ్రెస్, వైసీపీలే ఎక్కువ సార్లు విజయం సాధించాయి. దీనికి కారణం కూడా లేకపోలేదు. ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గంలో రెడ్డి సామాజికవర్గం ఓట్లు ఎక్కువగా ఉండటంతో టీడీపీకి అవకాశం తక్కువ సార్లు దక్కింది. .. ఇక మాగుంట సుబ్బరామిరెడ్డి 1991లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ఆయన హత్య జరిగిన తర్వాత మాగుంట సతీమణి పార్వతమ్మ 1996లో ఎంపీగా ఎన్నికయ్యారు. ఇక 1998, 2004, 2009లో వరసగా మాగుంట శ్రీనివాసులురెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎంపీగా ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం నుంచి గెలిచారు. 2014లో టీడీపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తిరిగి 2024 లో టీడీపీ నుంచి పోటీ చేసి గెలిచారు. అయితే వచ్చే ఎన్నికలలో మాగుంట రాఘవరెడ్డి పోటీ చేస్తారని ప్రకటించడంతో ఇప్పుడు వైసీపీ నుంచి తిరిగి వైవీ సుబ్బారెడ్డి పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి వైవీని తట్టుకుని యువకుడు మాగుంట రాఘవరెడ్డి ఏమాత్రం నెగ్గుకొస్తారన్నది చూడాలి.

**పుట్టిన రోజు రిటైర్మెంట్**

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి వచ్చే ఎన్నికల నుంచి ఇక తాను పోటీ చేయనని ప్రకటించారు. ఒంగోలులో జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో ఆయనీ ప్రకటన చేశారు. వచ్చే ఎన్నికల నుంచి తన కుమారుడు రాఘవరెడ్డి పోటీ చేస్తారని ప్రకటించారు. ఈ ఎన్నికల్లోనే రాఘవరెడ్డి పోటీ చేయాల్సి ఉన్నా.. చంద్రబాబు ఆదేశాలతో తానే పోటీ చేశానని మాగుంట చెబుతున్నారు.మాగుంటకు ఇటీవల ఆరోగ్యం సరిగ్గా ఉండటం లేదు.గుండె ఆపరేషన్ కూడా చేయించుకున్నారు. అయితే ఆయన గత ఎన్నికల్లోనే పోటీ నుంచి వైదొలగాలనుకున్నారు. ఆయన కుమారుడ్ని లైన్ లోకి తీసుకు వచ్చారు. కానీ మాగుంట రాఘవరెడ్డి ఢిల్లీ లిక్కర్ స్కాంలో జైలుకు పోవడంతో సీన్ రివర్స్ అయింది. అప్రూవర్ గా మారి ఎలాగోలా బెయిల్ తెచ్చుకున్నారు కానీ.. ఎన్నికల సమయంలో ఆ వివాదం ఇంకా లైవ్ లోనే ఉంది. పైగా వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చారు. అందుకే మాగుంటతోనే పోటీ చేయించారు.మాగుంట సుబ్బరామిరెడ్డి ఒకప్పుడు ప్రకాశం, నెల్లూరు రాజకీయాల్లో కీలకంగా ఉండేవారు. నక్సలైట్లు ఆయనను హత్య చేయడంతో మాగుంట శ్రీనివాసులరెడ్డి రాజకీయాల్లోకి రావాల్సి వచ్చింది. వివాద రహితుడిగా పేరున్న ఆయన వైసీపీలో ఎంపీగా ఉన్న సమయంలో అనేక అవమానాలు ఎదుర్కొన్నారు.

# ఇద్దరు స్టార్ ప్లేయర్లను వదులుకుంటున్న ఢిల్లీ.. రూ.25 కోట్లతో ఆసీస్ స్టార్ ఆటగాళ్లపై కన్ను!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. టోర్నీ ప్రారంభంలో ఆడిన నాలుగు మ్యాచ్ ల్లో గెలిచి దూసుకెళ్లిన ఆ జట్టు ఆ తర్వాత వరుసగా ఓడిపోయి ప్లే ఆఫ్స్ కు చేరుకోవడంలో విఫలమైంది. రానున్న సీజన్ లో అక్షర్ పటేల్ ను కెప్టెన్సీ నుంచితప్పించాలని చూస్తున్న క్యాపిటల్స్ జట్టులో భారీ మార్పులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2026 ఐపీఎల్ మినీ వేలానికి ముందు జట్టును మరింత పటిష్టం చేసుకోవాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఇద్దరు స్టార్ ప్లేయర్లను రిలీజ్ చేసే ఆలోచనలో కనిపిస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్ రిలీజ్ చేసే ఆటగాళ్లు.. టార్గెట్ చేసే ఆటగాళ్లు ఎవరో ఇప్పుడు చూద్దాం..
2026 ఐపీఎల్ మినీ వేలంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. డిసెంబర్ 13 నుంచి 15 వరకు ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్ జరగనున్నట్టు సమాచారం. ఇంకా అధికారిక డేట్ కన్ఫర్మ్ కాలేదు. ఇప్పటి నుంచే ఫ్రాంఛైజీలు తమ ప్లేయర్ల రిటెన్షన్, రిలీజ్ జాబితాలపై ఫోకస్ పెట్టాయి. 10 ఫ్రాంచైజీలు ఆటగాళ్ల రిటైన్ పై ఒక ఒక అంచనాకు వచ్చాయి. ఢిల్లీ క్యాపిటల్స్ రిలీజ్ చేసే ఆటగాళ్లలో టీమిండియా స్టార్ ఆటగాడు కేఎల్ రాహుల్ ఉండడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. రాహుల్ తో పాటు ఆసీస్ స్టార్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ను సైతం ఢిల్లీ రిలీజ్ చేయాలని భావిస్తోందట. ఐపీఎల్ 2025 మెగా ఆక్షన్ లో రాహుల్ ను రూ. 14 కోట్లతో ఢిల్లీ క్యాపిటల్స్ కొనుగోలు చేసింది. ఈ టోర్నీలో రాహుల్ స్థాయికి తగ్గట్టు రాణించలేదని ఢిల్లీ యాజమాన్యం అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం. ముఖ్యంగా ప్లే ఆఫ్స్ కు ముందు జరిగిన కీలక మ్యాచ్ ల్లో రాహుల్ విఫలం కావడం ఢిల్లీ బాగా హర్ట్ అయినట్టు తెలుస్తోంది. దీనికి తోడు కేఎల్ స్ట్రైక్ రేట్ పై నిరాశగా ఉందట. రాహుల్ తో పాటు ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ను ఢిల్లీ రిలీజ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2025 మెగా ఆక్షన్ లో స్టార్క్ ను ఢిల్లీ రూ. 14 కోట్లతో ఢిల్లీ క్యాపిటల్స్ కొనుగోలు చేసింది. అయితే స్టార్క్ మాత్రం ఒకటి రెండు మ్యాచ్ ల్లో మినహాయిస్తే పెద్దగా ప్రభావం చూపించలేకపోయాడు.

**గ్రీన్, మిచెల్ ఓవెన్ పై కన్ను:**
ఆస్ట్రేలియా స్టార్ ఆల్ రౌండర్ కామెరాన్ గ్రీన్ ఐపీఎల్ 2026 మినీ వేలంలో దిల్ క్యాపిటల్స్ దక్కించుకోవాలని భావిస్తోందట. గ్రీన్ బ్యాటింగ్ తో పాటు బౌలింగ్ చేయగలడు. ఇలాంటి ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ జట్టులో ఉంటే ఏ జట్టు అయినా పటిష్టంగా మారుతుంది. ఈ ఆజానుభావుడుపై చాలా ఐపీఎల్ జట్లు కన్నేసినట్టు సమాచారం. గాయంతో 2025 ఐపీఎల్ కు దూరమైనా గ్రీన్ మళ్ళీ క్రికెట్ లోకి అడుగుపెట్టాడు. తన రీ ఎంట్రీలోనే ఈ ఆసీస్ ఆల్ రౌండర్ టాప్ ఫామ్ తో చెలరేగుతు న్నాడు. వెస్టిండీస్ పై ఇటీవలే ముగిసిన ఐదు మ్యాచ్ల సిరీస్లో బ్యాటింగ్ లో గ్రీన్ దంచికొట్టాడు. వరుసగా 51, 56లి, 11, 55లి, 32 స్కోర్లు చేసి సత్తా చాటాడు. అంతేకాదు ఆదివారం (ఆగస్టు 10) సౌతాఫ్రికాతో జరిగిన తొలి టీ20లో 13 బంతుల్లోనే 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 35 పరుగులు చేశాడు.

**ఎవరీ మిచెల్ ఓవెన్..?**
మిచెల్ ఓవెన్ 2024-25లో బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్)లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. హెూబర్ట్ హరికేన్స్ తరపున 200 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్తో 452 పరుగులు చేశాడు. బిగ్ బాష్ లీగ్ ఫైనల్లో ఓవెన్ కేవలం 42 బంతుల్లో 108 పరుగులు చేసి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఇన్నింగ్స్ లో 11 సిక్సర్లు, 6 ఫోర్లు ఉన్నాయి. బిగ్ బాష్ చరిత్రలో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసి సంచలనం సృష్టించాడు. ఈ మెగా ఫైనల్లో 39 బంతుల్లో సెంచరీ చేసి పాకిస్థాన్ సూపర్ లీగ్ లో.. ఆ తర్వాత ఇండియన్ ప్రీమియర్ లీగ్ కు ఎంపికయ్యాడు.

# ఇండియా, ఆస్ట్రేలియా మెగా సిరీస్.. స్క్వాడ్, టైమింగ్, షెడ్యూల్ లైవ్ స్ట్రీమింగ్ వివరాలు ఇవే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా, ఇండియా జట్ల మధ్య అక్టోబర్ 19 నుంచి జరగబోయే వన్డే సిరీస్ కు భారీ హైప్ నెలకొంది. ఈ రెండు ప్రపంచంలోనే అగ్ర జట్లు కావడంతో ఈ సిరీస్ క్రేజ్ నెక్స్ట్ లెవల్లో ఉంది. ఆడేది మూడు వన్డే మ్యాచ్ లే అయినప్పటికీ టీ20 సిరీస్ కంటే వన్డే సిరీస్ కు ఎక్కువగా క్రేజ్ ఉండడం విశేషం. టీమిండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్ లోకి బరిలోకి దిగడమే ఇందుకు ప్రధాన కారణం. ఇప్పటికే ఆస్ట్రేలియా చేరుకున్న భారత జట్టు ప్రాక్టీస్ మొదలుపెట్టింది. నయా కెప్టెన్ గిల్ టీమిండియాను నడిపించనున్నాడు. 2020 తర్వాత ఇండియా తొలిసారి వైట్ బాల్ ఫార్మాట్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. అక్టోబర్ 19 నుంచి 25 వరకు వన్డే సిరీస్.. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 8 వరకు టీ20 సిరీస్ జరుగుతుంది. అక్టోబర్ 19న పెర్త్ లో తొలి వన్డేతో టూర్ మొదలవుతుంది. అక్టోబర్ 23 న అడిలైడ్ లో రెండో వన్డే.. అక్టోబర్ 25 న సిడ్నీలో మూడో వన్డే జరుగుతుంది. ఆ తర్వాత టీ20 సిరీస్ జరుగుతుంది. అక్టోబర్ 29 న మనుకా ఓవల్ లో తొలి టీ20 ప్రారంభమవుతుంది. నవంబర్ 8 వరకు టీ20 సిరీస్ జరుగుతుంది. ఈ హై వోల్టేజ్ సిరీస్ కు రెండు జట్ల స్క్వాడ్, టైమింగ్, షెడ్యూల్ లైవ్ స్ట్రీమింగ్ వివరాలు ఇప్పుడు చూద్దాం..

ఇండియా, ఆస్ట్రేలియా వన్డే సిరీస్: తేదీలు, వేదికలు
తొలి వన్డే : అక్టోబర్ 19, పెర్త్ స్టేడియం, పెర్త్
రెండవ వన్డే: అక్టోబర్ 23, అడిలైడ్ ఓవల్, అడిలైడ్
మూడవ వన్డే: అక్టోబర్ 25, సిడ్నీ క్రికెట్ గ్రౌండ్, సిడ్నీ
టైమింగ్, లైవ్ స్ట్రీమింగ్, టెలికాస్టింగ్ వివరాలు:
మూడు వన్డేలు భారత కాలమానం ప్రకారం ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నాయి. టాస్ ఉదయం 8:30 గంటలకు వేస్తారు.
లైవ్ టెలికాస్ట్: స్టార్ స్పోర్ట్స్ నెట్ వర్క్ మూడు వన్డేలను ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది
లైవ్ స్ట్రీమింగ్: జియో సినిమా యాప్, వెబ్‌సైట్ లో ప్రత్యక్ష ప్రసారం అందుబాటులో ఉంటుంది.
వన్డే సిరీస్ కు ఇండియా స్క్వాడ్:
శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), అక్షర్ పటేల్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ధృవ్ జురెల్, యశస్వి జైస్వాల్, నితీష్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, మహ్మద్ సిరాజ్, అర్షదీప్ కృష్ణ సింగ్
ఇండియాతో వన్డే సిరీస్ కు ఆస్ట్రేలియా జట్టు:
మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్లెట్, కూపర్ కొన్నోలీ, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, జోష్ హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, మాథ్యూ కుహ్నెమాన్, మార్నస్ లాబుస్చాగ్నే, మిచెల్ ఓవెన్, జోష్ ఫిలిప్, మాథ్యూ రెన్షా, మాథ్యూ షార్ట్, మిచెల్ స్టార్క్
రెండు, మూడు వన్డేలకు: ఆడమ్ జంపా , అలెక్స్ కారీ , జోష్ ఇంగ్లిస్

# 20 ఏళ్ళ ముందే మేము బజ్ బాల్ పరిచయం చేశాం.. యాషెస్‌కు ముందు హీట్ పెంచేసిన గిల్‌క్రిస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగబోయే ప్రతిష్టాత్మకమైన యాషెస్ కు నెల రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా ఇండియాతో పరిమిత ఓవర్ల క్రికెట్ ఆడడానికి సిద్ధంగా ఉంది. మరోవైపు న్యూజిలాండ్ తో ఇంగ్లాండ్ జట్టు టీ20 సిరీస్ ఆడనుంది. ఈ రెండు సిరీస్ ల తర్వాత ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్లు యాషెస్ లో తలపడతాయి. నవంబర్ 21 నుంచి జరగబోయే ఈ సమరానికి ఆస్ట్రేలియా వేదిక కానుంది. ఈ మెగా సిరీస్ కు ముందు ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ ఇంగ్లాండ్ పై అదిరిపోయే కౌంటర్ విసిరి సిరీస్ కు ముందు హీట్ పెంచేశాడు. ఇంగ్లాండ్ ఓపెనర్ జాక్ క్రాలీ ఇటీవలే ఆస్ట్రేలియాపై ఘాటు వ్యాఖ్యలు చేశాడు. బజ్ బాల్ ఆట తీరు ముందు ఆస్ట్రేలియా తట్టుకోలేదు అనేట్టుగా కామెంట్స్ చేశాడు. క్రాలీ కామెంట్స్ కు గిల్‌క్రిస్ట్ అదిరిపోయే రిప్లై ఇచ్చాడు. గిల్‌క్రిస్ట్ మాట్లాడుతూ ఇలా అన్నాడు.. " మేము 20 సంవత్సరాల ముందే బజ్ బాల్ ఆట ఆడేవాళ్ళం. 2000 సంవత్సరం ప్రారంభంలో ఆస్ట్రేలియా దూకుడైన ఆట తీరు ఆడింది. రికీ పాంటింగ్, మాథ్యూ హేడెన్ వంటి ఆటగాళ్ళు టెస్ట్ క్రికెట్‌లో ఎటాకింగ్ ఆడుతూ ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించేవారు. బజ్ బాల్ ఆటకు ఆకర్షణీయంగా మారుతుంది. రానున్న యాషెస్ లో ఇది కొనసాగాలని భావిస్తున్నాను". అని కాయో స్పోర్ట్స్‌లో గిల్‌క్రిస్ట్ అన్నాడు. క్రికెట్ లో ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్ కంటే ఇంగ్లండ్, ఆస్ట్రేలియా యాషెస్ కు ఎక్కువ క్రేజ్ ఉందని భావిస్తారు. 1882లో తొలిసారి యాషెస్ సిరీస్ జరిగింది. ప్రతి రెండేళ్లకోసారి ఈ ప్రతిష్టాత్మక సిరీస్ వచ్చినప్పుడల్లా క్రికెట్ ప్రపంచంలో చర్చ జరుగుతూనే ఉంటుంది. నవంబర్ 21 నుంచి ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ స్టార్ట్ అవుతుంది. సొంతగడ్డపై జరగబోయే ఈ టెస్ట్ సిరీస్ ను ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో ఆస్ట్రేలియా ఉంది. మరోవైపు 2015 నుంచి యాషెస్ గెలవని ఇంగ్లాండ్ ఎలాగైనా ఆసీస్ కు షాక్ ఇవ్వాలని చూస్తోంది. చివరిసారిగా ఇంగ్లాండ్ లో జరిగిన యాషెస్ 2-2 తో సమమైంది. తొలి రెండు టెస్టులు ఆస్ట్రేలియా గెలిస్తే చివరి మూడు టెస్టుల్లో ఇంగ్లాండ్ రెండు టెస్టులు గెలిచింది. ఒక మ్యాచ్ డ్రా గా ముగిసింది. అంతకముందు 2021-22 యాషెస్ లో ఆస్ట్రేలియా 4-0తో గెలిచింది. ఆస్ట్రేలియా చివరి 15 స్వదేశీ టెస్టుల్లో రెండింటిలో మాత్రమే ఓడిపోయింది. ఓవరాల్ గా ఇప్పటి వరకూ చరిత్రలో మొత్తం 330 యాషెస్ టెస్ట్ మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో ఆస్ట్రేలియా 136 టెస్టులు, ఇంగ్లండ్ 108 టెస్టులు గెలవగా.. 91 మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ఇటీవలే ఇండియాతో ఇంగ్లాండ్ 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను 2-2 తో సమం చేసుకుంది. మరోవైపు ఆస్ట్రేలియా వెస్టిండీస్ పై 3-0 తేడాతో గెలిచింది.

# నా విషయంలో అనుకున్నదాని కంటే ఎక్కువే జరిగింది







ఎవరి జీవితం ఎప్పుడు ఎలాంటి టర్న్ తీసుకుంటుందో చెప్పలేం. లైఫ్ లో ఏదీ ప్లాన్ చేసి రాదు అని అంటోంది మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్. జీవితం ఊహించని మలుపులు తీసుకుంటుందని, అది మనల్ని ఎవరూ ఊహించని ప్రదేశాలకు తీసుకెళుతుందని చెప్పింది. తన కెరీర్ విషయంలో తన ఇమాజినేషన్ కు మించి జరిగిందని ఆమె కొత్త సినిమా బైసన్ ప్రమోషన్స్ లో భాగంగా ఓ సందర్భంలో తెలిపింది.అవును, కరక్టే ఆమె విషయంలో అదే జరిగింది. ఒక్కటైనా మంచి సినిమాలో నటించాలని కెరీర్ ప్రారంభించిన ఆమెకు, గడిచిన 10ఏళ్లలో అనేక మంచి క్యారెక్టర్లు పడ్డాయి. ఈ ఒక్క ఏడాదిలోనే అనుపమ కీలక పాత్ర పోషించిన డ్రాగన్, జానకీ వర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ, పరదా, కిష్కిందపురి సినిమాలు థియేటర్లలో రిలీజ్ అయ్యాయి. ఈ నాలుగు సినిమాలు నాలుగు విభిన్న కథలు. నాలుగింట్లో అనుపమ నాలుగు వైవిధ్యమైన రోల్స్ చేసింది.ఇక ఈ ఏడాది ఆమె ఐదో సినిమా కూడా రానుంది. ఆమె హీరోయిన్ గా- చియన్ విక్రమ్ కుమారుడు ధ్రువ్ హీరోగా నటించిన బైసన్ రేపు థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలో సినిమా గురించి పలు విషయాలు అనుపమ షేర్ చేసుకుంది. ఈ నేపథ్యంలోనే విధి గురించి అనుపమ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ఈ సినిమా డైరెక్టర్ మారి సెల్వరాజ్ తో గతంలో పెరియేరుమ్ పేరుమాల్ అనే తమిళ సినిమా మిస్ చేసుకుంది. దీంతో అనుపమ కొన్నేళ్లుగా నిరాశ చెందింది.ఆయనతో పని చేసే అవకాశం మళ్లీ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసిందట. అలా కొన్నేళ్లకు మళ్లీ అదే డైరెక్టర్ తో బైసన్ లో నటించే ఛాన్స్ దక్కించుకుంది. ఈ విషయం గురించి మాట్లాడుతూ.. నేను ప్రేమమ్ చేసినప్పుడు, నాకు సినిమా గురించి ఏమీ తెలియదు. ప్రతిదీ కొత్తగా, ఏదో మాయాజాలంగా అనిపించింది. ఇప్పుడు పదేళ్ల తర్వాత, బైసన్ ఫొటో షూట్ సమయంలో నేను మళ్లీ అలాగే ఫీల్ అయ్యాను. అని అనుపమ చెప్పింది. అని తన పదేళ్ల కెరీర్ ను సింపుల్ గా వివరించింది.కాగా, ఇప్పుడు ఆమె కొత్త సినిమా బైసన్ విడుదలకు రెడీ అయ్యింది. రేపే థియేటర్లలోకి వస్తున్నా.. అనుమలో ఎలాంటి ఆందోళన, భయం కనిపించడం లేదు. ఆమె ప్రశాంతంగా ఉన్నట్లు అనిపిస్తుంది. అతిగా ఆలోచించడం లేదు. ఫలితం ఏదైనా స్వీకరించడానికి రెడీ అన్నట్లు కనిపించింది. ఆ క్రంలోనే విధి తనను ఊహకు మించి ఉన్నత శిఖరాల్లోకి తీసుకెళ్లిందని చెప్పింది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com